RNI NO : TELTEL/2023/89146
Telugu Daily

# శెనార్తి మీడియా

మన యాసే.. మన బలం

తెలుగుదినపత్రిక | సంపుటి :3 | సంచిక:210 | శుక్రవారం | 04 సెప్టెంబర్ 2026 | పేజీలు :8 | వెల రూ.5

Published from : Karimnagar Circulated to : Adilabad, Warangal, Hyderabad, Khammam, Nalgonda, Mahbubnagar, Medak, Nizambad, Rangareddy

రిపోర్టర్లు కావలెను




జర్నలిజంలో ఆసక్తి ఉన్న వారికి
శెనార్తి మీడియా
ఆహ్వానం పలుకుతుంది
తెలుగు రాష్ట్రాలలో జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయిలో రిపోర్టర్లుగా పని చేసేందుకు ఆసక్తి, అనుభవం ఉన్నవారు ఈ క్రింది నంబర్లలో సంప్రదించగలరు.
77309 83966 98491 98098



# పంతం నెగ్గించుకున్న రేవంత్

- మంత్రివర్గం నుంచి సురేఖ బర్త్ రఫ్
- అధిష్టానంపై ఒత్తిడి తెచ్చి మరీ అనుకున్నది సాధించిన వైనం
- రాజీనామా చేయనని సురేఖ భీష్మించినా దక్కని ఫలితం
- పార్టీలో తనమాటే ఫైనల్ అని నిరూపించిన సీఎం
- పనిలో పనిగా చిన్నారెడ్డికి కూడా ఉద్వాసన
- మరో ముగ్గురు బీసీ మహిళలతో సురేఖ లోటు భర్తీ
- కాంగ్రెస్ లోనే ఉంటానని స్పష్టం చేసిన సురేఖ
- ఇతర పార్టీల నుంచి వస్తున్న ఆహ్వానాలు
- అవినీతి ఆరోపణలు లేకపోవడమే కారణం

**హైదరాబాద్, సెప్టెంబర్ 3:**

కాంగ్రెస్ ప్రభుత్వంలో కొన్ని వారాలుగా నలుగుతున్న తీవ్ర రాజకీయ ఉత్కంఠకు తెర పడింది. దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను మంత్రివర్గం నుండి బర్తరఫ్ చేస్తూ ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి సంచలన నిర్ణయం తీసుకున్నారు. లోక్‌భవన్‌లో గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లాను సీఎం రేవంత్ రెడ్డి

మిగతా 2వ పేజీలో..

## పదవి ఉన్నా లేకపోయినా గౌరవం ఉంది

- ప్లానింగ్ కమిషన్ పదవిపై షోకులేదు
- 'టిల్ ఫర్దర్ ఆర్డర్స్' పేరుతో పదవి ఇచ్చారు
- సీఎం రేవంత్‌ను కలిసేందుకు ప్రయత్నించలేదు
- గతంలోనే ప్రోటోకాల్ సదుపాయాలు వదులుకున్నా
- పదవి తొలగింపుపై మౌనం

2

## నా బర్త్ రఫ్‌కు కారణం ముఖ్యమంత్రే!

- అధిష్టానానికి ఆ ఉద్దేశం లేదు
- ఉరితీసేవారికైనా చివరిమాట చెప్పకునే అవకాశమిస్తారు
- నాకా అవకాశం కూడా ఇవ్వలేదు
- కొండా సురేఖ



**తెలంగాణ, సెప్టెంబర్ 3**

తనను బర్త్ రఫ్ చేసే విషయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పట్టుదలే కారణమని అధిష్టానానికి ఏమాత్రం ఇష్టం లేకపోయినా తాను రాజీనామా

మిగతా 2వ పేజీలో..

## పాత బస్తీ ఒరిజినల్ సిటీ

- ఈ ప్రాంత అభివృద్ధి బాధ్యత మాది
- కొబ్బరి కాయ కొట్టి చేతులు దులుపుకున్న బీఆర్ ఎస్ సర్కార్
- మీరాలం చెరువుపై కేబుల్ బ్రిడ్జి
- మూసీ రివర్ ఫ్రంట్ అభివృద్ధి:
- స్టీల్ ఫ్లైఓవర్ ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, సెప్టెంబర్ 3 :**

పాత బస్తీ ప్రాంతం వెనుకబడిన ఓల్డ్ సిటీ కాదని, ఇది నగరానికి గుండెకాయ లాంటి 'ఒరిజినల్ సిటీ' అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభివర్ణించారు. చంచల్‌గూడ - సంతోష్‌నగర్ స్టీల్ ఫ్లైఓవర్‌ను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా చంచల్‌గూడ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడుతూ హైదరాబాద్ నగర అభివృద్ధికి ముఖ్యంగా ఈ ప్రాంత పురోగతికి

మిగతా 3వ పేజీలో..



ప్రజలకు సీఎం శ్రీకృష్ణ జన్మాష్టమి శుభాకాంక్షలు



3

రెండు రోజులపాటు కొడంగల్‌లో సీఎం రేవంత్ పర్యటన



## కాంగ్రెస్ పాలనలో కాల్వల్లో నీళ్లు పారట్లే

- ఉమ్మడి మెదక్ జిల్లాపై సీఎం రేవంత్ పగ
- కేసీఆర్ హయాంలో 85% పూర్తయిన టన్నెల్
- మిగిలిన 300 మీటర్లు తవ్వలేని చేతకాని ప్రభుత్వం
- ఆగిపోయిన నర్సాపూర్ కాళేశ్వరం కాల్వ పనులు ప్రారంభించాలి
- నర్సాపూర్ కాల్వ వద్ద రేవంత్‌కు హరీష్‌రావు సెల్ఫీ ఛాలెంజ్

2



## బీఆర్ఎస్ పాలనలో రైతు వినాశనం

- కాంగ్రెస్ రెండున్నరేళ్ల పాలనలో రైతు వికాసం
- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల

2

## విద్యుత్ స్తంభం ఎక్కిన ఎస్పీడీసీఎల్ సీఎండీ!

- 'బస్తీ బాట'లో భద్రతా ప్రమాణాల పరిశీలన

3

## రేవంత్ రెడ్డిని శపిస్తున్నా

- నా తల్లికి తీవ్ర అన్యాయం జరిగింది
- సురేఖ కూతురు సుష్మిత ఆవేదన
- పరకాల నియోజకవర్గంలో పోటీకి రేవంతుకు సవాల్

3



## మోదీని కలిసి తెలంగాణ హక్కులు అడగాలి



- కేంద్ర నిధులు, ప్రాజెక్టులపై ప్రశ్నించాలి
- బీజేపీకి మంత్రి పొన్నం డిమాండ్

**హైదరాబాద్, సెప్టెంబర్ 3 :**

రాష్ట్రంలో బీజేపీ నేతలు తమ పార్టీలోని అంతర్గత విభేదాలను కప్పిపుచ్చుకునేందుకే కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్

మిగతా 2వ పేజీలో..



## భూ యజమానికి చట్టబద్ధ హక్కులు కల్పించడమే లక్ష్యం

- భూ రీ సర్వేకు హాజరు కాని సర్వేయర్లకు నోటీసులు ఇవ్వాలి
- సబ్ రిజిస్ట్రార్లు, తహసీల్దార్ల పనితీరు మారాలి
- అన్ని జిల్లాల్లో జనగామ యాప్ అమలు చేయాలి
- భద్రాద్రి ఐడీవోసీ సమీక్షలో మంత్రి పొంగులేటి

3

## రేవంత్ రెడ్డికి నా మద్దతు.. కాంగ్రెస్‌కు కాదు

- రూ.620 కోట్లతో సైదాబాద్ స్టీల్ ఫ్లైఓవర్
- బీఆర్ఎస్ హయాంలో పనులు నిలిచిపోయాయి

3

## సాగర్ నీటిని విడుదల చేయాలి

- రైతు సమస్యలపై కేటీఆర్ ధర్నా
- కాంగ్రెస్ పాలనలో రైతుల పరిస్థితి దారుణం
- రైతుబంధు, రైతుబీమా నిర్వీర్యం
- రుణమాఫీ సంపూర్ణంగా అమలు కాలేదు
- పది రోజుల్లో షెడ్యూల్ ఇవ్వకుంటే ఉద్యమం ఉధృతం

3



# పదవి ఉన్నా లేకపోయినా గౌరవం ఉంది

**హైదరాబాద్, సెప్టెంబర్ 4:**



తెలంగాణ ప్లానింగ్ కమిషన్ వైస్ చైర్మన్ పదవి నుంచి తొలగించిన నేపథ్యంలో మాజీ మంత్రి చిన్నారెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. తనకు పదవిపై ఎలాంటి షోకులేదని స్పష్టం చేశారు. ప్లానింగ్ కమిషన్ వైస్ చైర్మన్ పదవిని 'టిల్ ఫర్దర్ ఆర్డర్స్' పేరుతో ఇచ్చారని, ఆ ఉత్తర్వులు గురువారమే వచ్చాయని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలవడానికి తాను ఎలాంటి ప్రయత్నం చేయలేదన్నారు. పదవి ఉన్నా లేకపోయినా తనకు గౌరవం ఉందని చెప్పారు.

**ప్రోటోకాల్ సదుపాయాలు వదులుకున్నా**

గతంలో ప్లానింగ్ కమిషన్ వైస్ చైర్మన్‌గా ఉన్న సమయంలోనే ప్రోటోకాల్ సదుపాయాలను తాను వదులుకున్నానని చిన్నారెడ్డి గుర్తుచేశారు. పదవులు తనకు కొత్త కాదని, వాటిపై ప్రత్యేక ఆసక్తి లేదన్న సంకేతాలు ఇచ్చారు.

**వ్యవసాయ క్షేత్రానికి వెళ్లిన చిన్నారెడ్డి**

పదవి నుంచి తొలగించిన వెంటనే చిన్నారెడ్డి తన వ్యవసాయ క్షేత్రానికి వెళ్లిపోయారు. ఈ సందర్భంగా తనను కలిసేందుకు వచ్చిన అనుచరులు, మీడియా ప్రతినిధులతో మాట్లాడేందుకు ఆయన నిరాకరించారు. ప్రస్తుత పరిణామాలపై మరింతగా స్పందించకుండా మౌనం పాటించారు.

# రేవంత్ రెడ్డిని శపిస్తున్నా

**వరంగల్, సెప్టెంబర్ 3:**

రాష్ట్ర మంత్రివర్గం నుంచి కొండా సురేఖను సీఎం రేవంత్ రెడ్డి బర్తరఫ్ చేయడం రాజకీయంగా పెను సంచలనం రేపింది. ఈ నిర్ణయంపై సురేఖ కుమార్తె సుష్మిత తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. తన తల్లికి అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తంచేస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆమె శాపనార్థాలు పెట్టారు. తల్లి బర్తరఫ్పై స్పందించిన సుస్మిత "నా తల్లికి అన్యాయం జరిగింది. ఆమె పట్ల అనుసరించిన తీరు నన్ను తీవ్రంగా బాధించింది. మా అమ్మ గొంతును ఎవరూ నొక్కలేరు. నేను రేవంత్ రెడ్డిని శపిస్తున్నా" అని వ్యాఖ్యానించారు. "నా తల్లి ప్రాతినిధ్యం వహిస్తున్న పరకాల నియోజకవర్గం నుంచి పోటీ చేయాలని రేవంత్ రెడ్డికి సవాల్ విసురుతున్నాను" అని పేర్కొన్నారు. గతంలో తాను చేసిన వ్యాఖ్యలు కేవలం వ్యక్తిగత హోదాలో ఒక వ్యక్తిని ఉద్దేశించినవే తప్ప, ఏ పార్టీకి వ్యతిరేకం కాదని ఆమె స్పష్టం చేశారు.

# బీఆర్ఎస్ పాలనలో రైతు వినాశనం

**హైదరాబాద్, సెప్టెంబర్ 3 :**

బీఆర్ఎస్ పార్టీ విడుదల చేసిన చార్జిషీట్‌పై వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రైతుల వినాశనం జరిగితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండున్నరేళ్లలోనే రైతు వికాసం దిశగా విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చామని స్పష్టం చేశారు. రైతుల జీవితాలతో ఆడుకున్న బీఆర్ఎస్ నాయకులకు సంక్షేమంపై మాట్లాడే నైతిక హక్కు లేదని మండిపడ్డారు. హామీ ఇచ్చిన విధంగానే రూ.2 లక్షల వరకు పంట రుణాలను మాఫీ చేస్తూ 25.35 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.20,616.89 కోట్లు జమ చేశామని మంత్రి తెలిపారు. సాంకేతిక లోపాలున్న ఖాతాలను కూడా సరిచేసి మరో రూ.2,747.67 కోట్లు రుణ మాఫీ చేశామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటివరకు రూ.36,000 కోట్ల రైతుభరోసా నిధులను అందించిందని, ఇటీవలే కేవలం తొమ్మిది రోజుల్లో రూ.9,000 కోట్లను నేరుగా రైతుల ఖాతాల్లోకి బదిలీ చేసినట్లు వివరించారు. కాంగ్రెస్ పాలనలో రాష్ట్రంలో స్థూల సాగుభూమి 5 శాతం పెరిగి 220.77 లక్షల ఎకరాలకు చేరిందని, ఆహార ధాన్యాల ఉత్పత్తి కూడా 236.87 లక్షల మెట్రిక్ టన్నులకు పెరగనుందని పేర్కొన్నారు.కేంద్ర ప్రభుత్వం కొనుగోలు చేయని పంటలను సైతం రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత తీసుకుందని, రూ.6,000 కోట్లతో మొక్కజొన్న, రూ.2,000 కోట్లతో జొన్నలను మద్దతు ధరకు కొనుగోలు చేసినట్లు చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం తీసుకొచ్చిన యూరియా యాప్ విజయవంతమవ్వడంతో దాన్ని ఆదర్శంగా తీసుకుని కేంద్ర ప్రభుత్వం 'ఫెర్టిలైజర్ ఫెయిర్ సేల్ (ఎఫ్ఎఫ్ఎస్) యాప్‌ను ప్రవేశపెట్టిందని మంత్రి తెలిపారు. బీఆర్ఎస్ నాయకులు ముందుగా తమ పదేళ్ల రైతు వ్యతిరేక పాలనపై ప్రజలు వేసిన చార్జ్‌షీట్‌కు సమాధానం చెప్పాలన్నారు. గతంలో యూరియా కోసం క్యూలలో నిలబెట్టి, వాయిదాల పద్ధతిలో రుణమాఫీ చేసి రైతులపై వేల కోట్ల వడ్డీ భారం మోపిన చరిత్ర బీఆర్ఎస్‌దేనని ఎద్దేవా చేశారు. నిలిచిపోయిన 19 కేంద్ర ప్రాయోజిత పథకాలను పునరుద్ధరించి రూ.917.30 కోట్లు మంజూరు చేయించామని, ఆయిల్‌పామ్ సాగులో 58.5 శాతం వృద్ధి సాధించామని మంత్రి తుమ్మల వివరించారు.

# మోదీని కలిసి తెలంగాణ హక్కులు అడగాలి

**మొదటిపేజీ తరువాయి**



ఆరోపించారు. రాష్ట్ర ప్రయోజనాలపై నిజంగా చిత్తశుద్ధి ఉంటే హైదరాబాద్‌లో కూర్చొని రాష్ట్ర ప్రభుత్వాన్ని విమర్శించడం కాక ఢిల్లీకి వెళ్లి ప్రధాని నరేంద్ర మోదీని నిలదీయాలని సవాల్ చేశారు. తెలంగాణకు కేంద్రం నుంచి రావాల్సిన నిధులు, పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులు, అనుమతులపై బీజేపీ నేతలు ఎందుకు మాట్లాడటం లేదని పొన్నం ప్రశ్నించారు. రాష్ట్రానికి రావాల్సిన నిధుల కోసం కేంద్రంపై ఒత్తిడి తేవాల్సిన బాధ్యత ఇక్కడి బీజేపీ నేతలపై ఉందన్నారు. రాష్ట్ర ప్రజల కోసం పోరాడే దమ్ము చూపించాలని సూచించారు. బీజేపీ పాలిత రాష్ట్రాలకు కేంద్రం నుంచి నిధులు, ప్రాజెక్టులు మంజూరవుతున్న తీరును తెలంగాణ విషయంలో ఎందుకు అమలు చేయడం లేదో ఆ పార్టీ నేతలు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శిస్తేనే రాజకీయ ఉనికి కాపాడుకోవచ్చని భావించడం సరికాదన్నారు. ప్రతిపక్షంగా నిర్మాణాత్మకంగా వ్యవహరించి రాష్ట్ర హక్కుల కోసం కేంద్రాన్ని ప్రశ్నించాలని సూచించారు. గతంలో పదేళ్లపాటు రాష్ట్రంలో అధికారంలో ఉన్న టీఆరఎస్ ప్రభుత్వం అనేక బకాయిలు పెట్టినప్పుడు బీజేపీ నేతలు ఎందుకు ప్రశ్నించలేదని పొన్నం నిలదీశారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పటికప్పుడు చెల్లింపులు చేస్తూ పాత బకాయిలను కూడా పరిష్కరించే దిశగా ముందుకు వెళ్తోందన్నారు. రాష్ట్రానికి సంబంధించిన అనేక హామీలు, నిధులు, ప్రాజెక్టులు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయని మంత్రి ఆరోపించారు. రాష్ట్రానికి న్యాయంగా రావాల్సిన పన్నుల వాటా కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కేంద్రాన్ని డిమాండ్ చేస్తోందన్నారు. పెండింగ్‌లో ఉన్న మెట్రో రైల్, నవోదయ విద్యాలయాలు, కేంద్ర పాఠశాలలు, రీజినల్ రింగ్ రోడ్ తదితర ప్రాజెక్టులకు వెంటనే అనుమతులు, నిధులు మంజూరు చేయాలని కోరారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం ఇక్కడి బీజేపీ నేతలు ఢిల్లీ వెళ్లి ప్రధాని మోదీని కలిసి నిధులు, ప్రాజెక్టులపై స్పష్టమైన హామీ తీసుకురావాలని పొన్నం సూచించారు.

# పంతం నెగ్గించుకున్న రేవంత్

**మొదటిపేజీ తరువాయి**

గురువారం సాయంత్రం స్వయంగా కలిసి బర్తరఫ్ ఫైలును అందజేయగా, గవర్నర్ దానికి తక్షణమే ఆమోదం ముద్ర వేశారు. మంత్రి కొండా సురేఖ బర్తరఫ్ ప్రక్రియ అత్యంత నాటకీయ పరిణామాల మధ్య సాగింది. గురువారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు మంత్రులు పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్ తదితరులు లోక్‌భవన్‌కు చేరుకుని గవర్నర్‌తో సుదీర్ఘంగా సమావేశమయ్యారు. కాంగ్రెస్ అధిష్ఠానం ఆదేశాల మేరకు సిద్ధం చేసిన కొండా సురేఖ బర్తరఫ్ ఫైల్‌పై సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలోనే గవర్నర్ సంతకం చేశారు. అనంతరం ఆమెను క్యాబినెట్ నుండి తొలగిస్తూ అధికారిక ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ ఏడాది ఆగస్టులో కొండా సురేఖ కుమార్తె కొండా సుస్మితా పటేల్ ఒక బహిరంగ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరియు ఆయన కుటుంబ సభ్యులను లక్ష్యంగా చేసుకుని వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. సీఎం కుటుంబ వ్యాపార లావాదేవీలపై ఆరోపణలు చేయడంతో పాటు పరకాల నియోజకవర్గం నుండి తానే పోటీ చేస్తానని సుస్మిత ప్రకటించడం పార్టీలో తీవ్ర దుమారం రేపింది. కూతురి వ్యాఖ్యలను మంత్రి కొండా సురేఖ బహిరంగంగా ఖండించకపోగా, అవి ఆమె వ్యక్తిగత అభిప్రాయాలంటూ సమర్థించుకోవడంతో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలోనే టీపీసీసీ క్రమశిక్షణా సంఘం ఇచ్చిన నివేదిక ఆధారంగా అధిష్ఠానం ఈ కఠిన చర్య తీసుకుంది.

**నగరపర్యటనలను అన్వేషించండి**

**పంతం నెగ్గించుకున్న రేవంత్**

రాష్ట్ర రాజకీయాల్లో సీనియర్ నేత, బీసీ మహిళా మంత్రి అయిన సురేఖను మంత్రివర్గం నుండి బర్తరఫ్ చేయించడం ద్వారా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన రాజకీయ పంతాన్ని, పట్టును పూర్తిగా నెగ్గించుకున్నారు. కాంగ్రెస్ పార్టీలోని సీనియర్ల నుంచి ఒత్తిళ్లు ఉన్నప్పటికీ, తన నాయకత్వానికి సవాల్ విసిరిన వారిపై కఠినంగా వ్యవహరిస్తాననే సంకేతాన్ని ఈ చర్య ద్వారా ఆయన స్పష్టం చేశారు. తన కుమార్తె చేసిన వ్యాఖ్యలకు తాను బాధ్యురాలిని కానని, మంత్రి పదవికి రాజీనామా చేసే ప్రసక్తే లేదని కొండా సురేఖ అధిష్ఠానం ఎదుట భీష్మించుకు కూర్చున్నారు. అయితే, ఆమె మొండికేసినా వెనక్కి తగ్గని రేవంత్ రెడ్డి, ఏకంగా బర్తరఫ్ అస్త్రాన్ని ప్రయోగించి ఆమెను క్యాబినెట్ నుండి ఉద్వాసన పలికేలా చేశారు. కొండా సురేఖ ఢిల్లీ వెళ్ళి పార్టీ అగ్రనేతలు మల్లికార్జున ఖర్గే, సోనియా గాంధీలకు ఇమెయిల్‌లు, వినతిపత్రాలు ఇచ్చి తన పదవిని కాపాడుకునేందుకు చివరి నిమిషం వరకు గట్టి ప్రయత్నాలే చేశారు. కానీ రేవంత్ రెడ్డి కేసీ వేణుగోపాల్ వంటి అగ్రనేతలతో వ్యూహాత్మకంగా చర్చలు జరిపి, పార్టీ క్రమశిక్షణా సంఘం నుండి నివేదిక తెప్పించి, హైకమాండ్ నుండి బర్తరఫ్‌కు గ్రీన్ సిగ్నల్ సాధించగలిగారు. కొండా సురేఖ ఆరోపించినట్లుగా—'తాను తొలగించకపోతే పదవిలో ఉండననే' స్థాయి రాజకీయ ఒత్తిడిని తెచ్చి రేవంత్ తన పంతాన్ని సాధించుకున్నారు. కొండా సురేఖను తొలగిస్తే వరంగల్ జిల్లాలో బీసీ సామాజికవర్గం నుండి వ్యతిరేకత వస్తుందనే అంచనాలకు రేవంత్ రెడ్డి ముందే చెక్ పెట్టారు. సురేఖను తొలగించిన రోజే, వరంగల్ జిల్లా నుంచే మరో బీసీ మహిళా నేత గుండు సుధారాణిని కుడా చైర్‌పర్సన్‌గా నియమించడంతో పాటు, గద్వాల్ విజయలక్ష్మిని ప్లానింగ్ బోర్డ్ వైస్ చైర్మన్‌గా, నేరెళ్ల శారదను మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా నియమించి మహిళా, బీసీ ఓటు బ్యాంక్ చెదిరిపోకుండా జాగ్రత్తపడ్డారు. తద్వారా సామాజిక సమీకరణాల నెపంతో తనపై ఒత్తిడి తెచ్చే ప్రయత్నాలకు రేవంత్ గండికొట్టారు. ఈ బర్తరఫ్ ఎపిసోడ్‌తో పాటు, పార్టీ లైన్ దాటిన మరో సీనియర్ నేత చిన్నా రెడ్డిని కూడా తెలంగాణ ప్లానింగ్ బోర్డ్ వైస్ చైర్మన్ పదవి నుంచి రేవంత్ రెడ్డి తక్షణమే తొలగించారు. దీని ద్వారా ప్రభుత్వంలోనూ, పార్టీలోనూ సీఎం మాటే ఫైనల్ అనే స్పష్టమైన సందేశాన్ని సొంత పార్టీ నేతలకు పంపారు.

**తీవ్రంగా స్పందించిన సురేఖ**

మంత్రి పదవి నుంచి బర్తరఫ్ కావడంపై కొండా సురేఖ తీవ్రంగా స్పందించారు. ప్రెస్ మీట్ పెట్టి తన ఆవేదనను వెళ్లగక్కారు. కనీసం తన వివరణ తీసుకోకుండా, ఒక్క మాట కూడా చెప్పకుండా నేరుగా బర్తరఫ్ చేయడం కక్షసాధింపు చర్యేనని ఆరోపించారు."నా కుమార్తె వయోజనురాలు. ఆమె చేసిన వ్యాఖ్యలకు నన్ను ఎలా బాధ్యురాలిని చేస్తారు?" అని సీఎం రేవంత్‌ను ప్రశ్నించారు. తనపై ఎలాంటి అవినీతి ఆరోపణలు లేకపోయినా కుట్రపూరితంగానే తనను పదవి నుంచి తొలగించారని మండిపడ్డారు. మంత్రి పదవి పోయినప్పటికీ తాను కాంగ్రెస్ పార్టీని వీడబోనని, ఎమ్మెల్యేగా కొనసాగుతూ ప్రజలకు సేవ చేస్తానని స్పష్టం చేశారు. ఒక బీసీ మహిళా మంత్రిని ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా తొలగించడం దారుణమంటూ ప్రతిపక్షాలు కూడా ఈ పరిణామంపై విమర్శలు గుప్పిస్తున్నాయి.

**బీజేపీ, ప్రజాశాంతి పార్టీ ఆహ్వానం**

సురేఖపై ఎలాంటి అవినీతి ఆరోపణలు లేవు కాబట్టి ఆమె ఒకవేళ వస్తే బీజేపీలోకి స్వాగతిస్తామని ఎంపీ ధర్మపురి అరవింద్, ఇతర నేతలు వ్యాఖ్యానించారు. దీంతో కొండా దంపతులు 'ప్లాన్-బి' లో భాగంగా బీజేపీ వైపు చూస్తున్నారనే పుకార్లు షురూ అయ్యాయి. ఈ ఊహాగానాలపై సురేఖ స్పందిస్తూ తాను బీజేపీలో చేరడం లేదని, భవిష్యత్తు కార్యాచరణపై కాంగ్రెస్ హైకమాండ్‌కు లేఖ రాశానని తెలిపారు. ఈ పరిణామాల మధ్య ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ కూడా ఆమెను తమ పార్టీలోకి రావాలంటూ బహిరంగంగా ఆహ్వానించారు.

# నా బర్త్ రఫ్‌కు కారణం ముఖ్యమంత్రే!

**మొదటిపేజీ తరువాయి**



చేస్తానని అధిష్టానాన్ని బ్లాక్‌యిల్ చేశాడని రేవంత్‌రెడ్డిపై కొండా సురేఖ విరుచుకుపడ్డారు. మరణ శిక్ష విధించిన వారికైనా చివరి మాట చెప్పే అవకాశమిస్తారని, తన విషయంలో అలాంటి అవకాశాన్నికూడా అధిష్టానం ఇవ్వకపోవడం విచారకరమని అన్నారు. ఢిల్లీలో ముఖ్యమంత్రితోపాటు ఇతర మంత్రులు, పీసీసీ అధ్యక్షుడు ఒకేచోట ఉన్నప్పటికీ తనను పిలిచి కూర్చోబెట్టి కనీసంగా మాట్లాడకపోవడాన్ని కూడా ఆమె తప్పుపట్టారు. ఇప్పటికీ తనను ఏ కారణంతో మంత్రిపదవినుండి బర్తరఫ్ చేశారన్నది అర్థం కావటంలేదన్నారు. వాస్తవానికి ముఖ్యమంత్రిని తాను ఒక్క మాటకూడా అనకున్నా షోకాజ్ నోటీసు ఎలా ఇస్తారని ప్రశ్నించారు. ఢిల్లీలో రెండు రోజులపాటు కాంగ్రెస్ అధిష్టానానికి తన బాధలు చెప్పుకున్న సురేఖ నిరాశతో వెనుతిరిగారు. ఢిల్లీ పరిణామాలపై ఆమె గురువారం వరంగల్‌లోని తన స్వగృహంలో నిర్వహించిన మీడియా సమావేశంలో తనను మంత్రి వర్గం నుండి బహిష్కరించినట్లు వస్తున్న వార్తలపై తీవ్రంగా స్పందించారు. తనను బహిష్కరించినట్లు వైరల్ అవుతున్న లేఖలో ఎవరు, ఎవరికి రాసారన్న విషయం స్పష్టంగా లేదన్నారు. ఒక తెల్ల కాగితంపైన అయిదారు లైన్లు మాత్రమే ఉన్నాయన్నారు. అయితే తనతోపాటు ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డిని కూడా బలి చేయడం సమంజసంకాదన్నారు. తనను తొలగించే క్రమంలో మరో ముగ్గురు మహిళలకు పదవులు కల్పించడంపైన స్పందిస్తూ తాను, తన భర్త సామాజిక వర్గానికి సంబంధించిన వారికి పదవులు కల్పించడంద్వారా కాంపెన్‌సేట్ చేయాలని ప్రభుత్వం వేసిన ఎత్తుగడగా ఆమె పేర్కొన్నారు. తన కూతురు చేసిన వ్యాఖ్యలను తనకు ఆపాదిస్తూ తనపై వేటు వేయడాన్ని సవాల్ చేస్తూ అదే నిజమైతే అంతకు ముందు పార్టీని తూలనాడిన వారిపై ఎందుకు చర్యలు తీసుకోలేదని సురేఖ ప్రశ్నించారు. క్రమశిక్షణ కమిటికి సారథ్యం వహిస్తున్న మల్లు రవి గతంలో కాంగ్రెస్‌ను తిట్టినవారేనన్నారు. జయపాల్‌రెడ్డి, రోశయ్యలు కూడా పార్టీపై కామెంట్ చేసినవారేనన్నారు. పిసీసీ అధ్యక్షుడిగా రూ50 కోట్లు ఇచ్చి రేవంత్‌రెడ్డి ఆ పదవి తెచ్చుకున్నాడన్న జగ్గారెడ్డి లాంటి వారిపైనా తీసుకోని చర్యలు కేవలం తనపైనే ఎందుకు చేపట్టినట్లని ఆమె నిలదీస్తున్నారు. పార్టీని గెలిపించుకునేందుకు తమ కాళ్ళు మొక్కి తమ జీపుల్లో ఎక్కినవారుకూడా తమను విమర్శించేవారైనారని కడిగిపారేశారు. ఈ సందర్భంగా తన కార్యాలయానికి సంబంధించిన సుమంత్‌పై తప్పుడు కేసులు పెట్టిన విధానంపైన కూడా ఆమె స్పందించారు. ఎవరైతే డబ్బులు వసూలు చేసుకున్నారో వారే కేసు పెట్టారని, తమ మనషులను కావాలని ఇలానే ఇబ్బందులకు గురి చేస్తున్నారంటూ సుమంత్‌పై పెట్టిన కేసును వెంటనే వెనక్కు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు.

**సీఎం నిర్ణయాలతో పార్టీలో ఎవరూ సంతోషంగా లేరు**

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీసుకుంటున్న సొంత నిర్ణయాలతో పార్టీలో ఎవరూ సంతోషంగా లేరన్నారు సురేఖ. మంత్రులు కూడా పాలనలో ఇబ్బందులకు గురవుతున్నారని, ఎవరూ నోరు తెరిచి చెప్పుకోలేకపోతున్నారని అన్నారు. సంతోషంగాలేని మంత్రులు బయటికి వచ్చి తమ బాధలను చెప్పుకోవాలని పిలుపునిచ్చారు. ఎందుకంటే ప్రజల సమస్యలను వినడానికి వారికి సమయం లేదు. ప్రజలిచ్చే పిటీషన్ తీసుకునేవారుండరు. ఒక వేళ తీసుకున్నా అది ఎటు పోతుందో తెలియని పరిస్థితి. ఎదుటివారివైపు ఒక వేలెత్తి చూపితే నాలుగు వేళ్ళు మనవైపు చూపుతాయన్న విషయాన్ని తెలుసుకోవాలన్నారు. అందుకే ప్రభుత్వం తాను ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేకపోతున్నదన్నారు. ప్రజలు వ్యతిరేకించక ముందే వారికిచ్చిన హామీలను నెరవేర్చాలని ప్రభుత్వానికి హితవు పలికారు. తాను కాంగ్రెస్‌లోనే కొనసాగడం, పార్టీకి, శాసనసభ సభ్యత్వానికి రాజీనామా చేసే విషయంలో ఆమె స్పష్టత ఇవ్వలేదు.

# కాంగ్రెస్ పాలనలో కాల్వల్లో నీళ్లు పారట్లే

**నర్సాపూర్, సెప్టెంబర్ 3 :**



తెలంగాణను సస్యశ్యామలం చేసిన కేసీఆర్ పాలన ఎక్కడ.. కాల్వల్లో నీళ్లు పారక తుమ్మ చెట్లు మొలుస్తున్న కాంగ్రెస్ పాలన ఎక్కడ అని బీఆరఎస్ శాసనసభాపక్ష ఉపనేత హరీశ్ రావు మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే నిలిచిపోయిన మల్లన్న సాగర్, కాళేశ్వరం కాల్వ పనులను నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డితో కలిసి క్షేత్రస్థాయిలో ఆయన గురువారం పరిశీలించారు. నర్సాపూర్ నియోజకవర్గం రెడ్డిపల్లి వద్ద ఆగిపోయిన కాల్వల్లో మొలిచిన తుమ్మ చెట్ల వద్ద నిలబడి ప్రభుత్వ చేతకానితనాన్ని ఎండగడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆయన సెల్ఫీ ఛాలెంజ్ విసిరారు. ఉమ్మడి మెదక్ జిల్లా ప్రాజెక్టులపై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని ఎండగట్టారు. మల్లన్న సాగర్ నుంచి నర్సాపూర్, ఆందోల్, సంగారెడ్డి నియోజకవర్గాలకు సాగునీరు అందించాలని ప్యాకేజీ 18, 19 కింద కేసీఆర్ అద్భుతమైన ప్రణాళిక చేశారని, ఇక్కడినుంచి చిన్న లిఫ్ట్ ద్వారా సింగూరులో గోదావరి నీళ్లు నింపి ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేయాలన్నది ఆయన సంకల్పమని చెప్పారు. కానీ ఈ ప్రభుత్వం వచ్చాక పనులన్నీ పడావు పెట్టారని విమర్శించారు. బీఆరఎస్ హయాంలోనే మల్లన్న సాగర్ నుంచి నర్సాపూర్ వచ్చే 18 కి.మీ టన్నెల్ పనుల్లో 85 శాతం పూర్తయ్యాయని, మిగిలిన కేవలం 300 మీటర్ల పని చేస్తే ఈ కెనాల్ ద్వారా నీళ్లు హల్దీ వాగులో పడి నిజాం సాగర్ వరకు గోదావరి జలాలు పరుగులు పెట్టేవని చెప్పారు. అటు నిజామాబాద్, ఇటు మెదక్ జిల్లాల రైతులకు మేలు జరిగేదని, కానీ అలా చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు అన్యాయం చేస్తోందని విమర్శించారు. మొన్న సంగారెడ్డికి వచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉచిత సలహాలు ఇచ్చారే తప్ప ఆగిపోయిన సాగునీటి ప్రాజెక్టుల ఊసెత్తలేదని మండిపడ్డారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో కాంగ్రెస్ దుకాణం బంద్ చేయాలనుకుంటున్నారా అని ప్రశ్నించారు. మెదక్ జిల్లా అంటే మీకు ఎందుకంత చిన్న చూపు.. మల్లన్న సాగర్, కొండపోచమ్మ సాగర్, రంగనాయక సాగర్ కింద ఉన్న పిల్ల కాల్వలు తవ్వడానికి కేవలం రూ.50 కోట్లు ఇస్తే చాలు.. 50 వేల ఎకరాలకు నీళ్లు వస్తాయి.. ఆ మాత్రం నిధులు ఇవ్వడానికి కూడా ముఖ్యమంత్రికి మనసు రావడం లేదు అని వ్యాఖ్యానించారు. నారాయణఖేడ్, జహీరాబాద్, ఆందోల్, సంగారెడ్డి, పటాన్ చెరు నియోజకవర్గాల్లో ఐదు లక్షల ఎకరాలకు నీరందించే బసవేశ్వర, సంగమేశ్వర ప్రాజెక్టులను గాలికి వదిలేశారన్నారు. కేసీఆర్ నిధులు మంజూరు చేసిన ఘనపురం ఆనకట్ట ఎత్తు పెంపు పనులను ఆపేశారు.. దుబ్బాకలో 80 శాతం పూర్తయిన లిఫ్ట్ ఇరిగేషన్ పనులు నిలిపివేసి రైతులను గోస పెడుతున్నారు.. ఎల్‌నినో ప్రభావంతో కరవు పరిస్థితులు వస్తాయని చెబుతున్నా మల్లన్న సాగర్, కొండపోచమ్మ రిజర్వాయర్లను నీళ్లతో నింపుకోవాలన్న కనీస సోయి ఈ ప్రభుత్వానికి లేదు అని అన్నారు. కేసీఆర్ ఉన్నప్పుడు ఎండాకాలంలోనూ హల్దీ, మంజీరా వాగుల మీద పదుల సంఖ్యలో చెక్ డ్యామ్‌లు మత్తడి దుంకాయి.. ఇప్పుడు చుక్క నీరు లేక వెలవెలబోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అందంగా తీర్చిదిద్ది ఇచ్చిన రాష్ట్రాన్ని నడపడం కూడా రేవంత్ రెడ్డికి చేతకావడం లేదని ఎద్దేవా చేశారు. వెయ్యి రోజుల పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉమ్మడి మెదక్ జిల్లాలో ఒక్క గజం కాల్వ కూడా తవ్వలేదని, కనీసం రూపాయి నిధులైనా విడుదల చేయలేదని అన్నారు.

**ప్రాజెక్టుల పనులు తక్షణం ప్రారంభించాలి**

సంగమేశ్వర, బసవేశ్వర ప్రాజెక్టుల పనులు తక్షణమే ప్రారంభించాలని, ఘనపురం ఆనకట్ట ఎత్తు పెంపు పనులను వెంటనే పూర్తి చేయాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. మల్లన్న సాగర్ నుంచి నర్సాపూర్, ఆందోల్‌కు నీళ్లు తీసుకొచ్చే కాళేశ్వరం కాల్వ పనులు పూర్తి చేయాలి.. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టుల భూసేకరణకు వెంటనే నిధులు విడుదల చేయాలి అని కోరారు. ఆగిపోయిన కాల్వ పనులకు, వాటిలో మొలిచిన తుమ్మ చెట్లకు సజీవ సాక్ష్యంగా ఇక్కడినుంచే సెల్ఫీ తీసి రేవంత్ రెడ్డికి ట్యాగ్ చేస్తున్నానన్నారు. ఇప్పటికైనా కళ్లు తెరిచి తక్షణమే ఆగిపోయిన టన్నెల్, కాల్వ పనులను, ప్రాజెక్టులను ప్రారంభించాలని డిమాండ్ చేస్తున్నాం అన్నారు.

# అసెంబ్లీ సమావేశాలకు సన్నద్ధం కండి

- **సీఎస్ సంజయ్ జాజు**

**హైదరాబాద్, సెప్టెంబర్ 3:**

ఈ నెల 7వ తేదీ నుంచి ప్రారంభం కానున్న రాష్ట్ర అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో సభ్యులు అడిగే ప్రశ్నలకు సమాధానాలను త్వరగా అందించేందుకు అన్ని శాఖలు ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. అసెంబ్లీ సమేశాల ఏర్పాట్లపై సచివాలయంలో ఉన్నతాధికారులతో జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ గౌరవ సభ్యులు ప్రస్తావించే అంశాలపై సంబంధిత శాఖలు తగిన సమాచారంతో సిద్ధంగా ఉండాలని, ప్రతి శాఖ తరపున అసెంబ్లీలో ఒక నోడల్ అధికారిని నియమించి ప్రశ్నలకు సమాధానాల తయారీ, సమాచార సేకరణ, సమన్వయం తదితర అంశాలను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ఉన్నతాధికారులు, విభాగాధిపతులు అవసరమైన సమాచారంతో ముందస్తుగా సిద్ధంగా ఉండాలన్నారు. శాసనసభలో ఏదైనా ప్రశ్నకు సంబంధించి అదనపు సమాచారం అవసరమైన సందర్భంలో వెంటనే సంబంధిత శాఖల నుంచి వివరాలను సేకరించి నిర్ణీత సమయంలో సమాధానం అందించే విధంగా సమన్వయ వ్యవస్థను పటిష్టం చేయాలని, పెండింగ్‌లో ఉన్న ప్రశ్నోత్తరాలకు సంబంధించిన సమాచారాన్ని అసెంబ్లీ అధికారులకు వెంటనే అందజేయాలని సూచించారు.

# పాత బస్తీ ఒరిజినల్ సిటీ

**మొదటిపేజీ తరువాయి**

ప్రజా ప్రభుత్వం పూర్తి నిధులను కేటాయిస్తుందని స్పష్టం చేశారు. గత ప్రభుత్వం ఈ ఫ్లైఓవర్‌కు కేవలం కొబ్బరికాయ కొట్టి చేతులు దులుపుకుందని, నిర్మాణానికి ఒక్క పైసా కూడా కేటాయించలేదని విమర్శించారు. తమ ప్రభుత్వం వచ్చిన వెంటనే నిధులు ఇచ్చి ప్రాజెక్టును వేగంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తెచ్చామని పేర్కొన్నారు. ఇక్కడ ప్రతీ గల్లీ తనకు తెలుసన్నారు. అసదుద్దీన్ అడిగిన ప్రతీ అభివృద్ధి పనులను మంజూరు చేయాలని ఈ వేదికగా అధికారులను ఆదేశిస్తున్నానన్నారు. నగరంలో పేదల కోసం లక్ష ఇందిరమ్మ ఇండ్లు నిర్మించబోతున్నామని తెలిపారు. ప్రతి పేద కుటుంబానికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ₹500లకే గ్యాస్ సిలిండర్ అందిస్తున్నామని గుర్తు చేశారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో అసదుద్దీన్ ఓవైసీ హిందుస్థాన్ కు మద్దతుగా నిలిచి దేశభక్తి చాటుకున్నారని తెలిపారు. రాజకీయ సిద్ధాంతాలు వేరు కావచ్చు.. దేశ భక్తి విషయంలో అందరం ఒక్కటేనని స్పష్టం చేశారు.

**విద్యాభివృద్ధికి రూ.25 కోట్లు**

ఎంఐఎం ఎమ్మెల్యే బలాల కళాశాల అభివృద్ధి కోసం ₹20 కోట్లు అడిగితే తమ ప్రభుత్వం ₹25 కోట్లు మంజూరు చేస్తోందని ప్రకటించారు. ఏడాదిన్నర కాలంలో ఈ అభివృద్ధి పనులను పూర్తి చేయాల్సిన బాధ్యత స్థానిక ఎమ్మెల్యేపైనే ఉందన్నారు. విద్య కోసం ఎంత ఖర్చు చేయడానికైనా ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.

**మీరాలం చెరువుపై కేబుల్ బ్రిడ్జి**

నగరంలో దుర్గం చెరువు తరహాలోనే మీరాలం చెరువుపై కూడా 3 కిలోమీటర్ల మేర అధునాతన కేబుల్ బ్రిడ్జి నిర్మిస్తామని సీఎం ప్రకటించారు.

**మెట్రో రైలు విస్తరణ**

వచ్చే ఎన్నికల నాటికి గౌలిగూడ నుంచి చాంద్రాయణగుట్ట వరకు మెట్రో పనులను పూర్తి చేసి, మెట్రోలోనే వచ్చి ప్రజలను ఓట్లు అడుగుతామని తెలిపారు. నాగోల్ నుంచి ఎల్బీనగర్, చాంద్రాయణగుట్ట, రాజేంద్రనగర్ మీదుగా శంషాబాద్ విమానాశ్రయం వరకు మెట్రోను విస్తరించబోతున్నామని చెప్పారు.

**మత సామరస్యం, సమాజ వికాసం**

హిందూ, ముస్లింలు కలిసికట్టుగా నడిస్తేనే తెలంగాణ రాష్ట్రం సస్యశ్యామలంగా అభివృద్ధి చెందుతుందని సీఎం అభిప్రాయపడ్డారు. దేశ భక్తి విషయంలో అందరూ ఒక్కటేనని, ఆపరేషన్ సింధూర్ సమయంలో అసదుద్దీన్ ఓవైసీ దేశానికి మద్దతుగా నిలిచి తన దేశభక్తిని చాటుకున్నారని గుర్తుచేశారు. గతంలో ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్లు కల్పించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని తెలిపారు. ఎన్నికల సమయంలో మాత్రమే రాజకీయాలు ఉండాలని, ఎన్నికలు ముగిసిన తర్వాత అందరం కలిసికట్టుగా నగరాన్ని అభివృద్ధి చేసుకుందామని సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్, ఎంపీలు అసదుద్దీన్ ఓవైసీ, వేం నరేందర్ రెడ్డి, అనిల్ కుమార్ యాదవ్, రఘువీర్ రెడ్డి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లు పాల్గొన్నారు.

**మూసీ రివర్ ఫ్రంట్ అభివృద్ధి**

మూసీ నదిని అభివృద్ధి చేసి నైట్ ఎకానమీని ప్రోత్సహించడం ద్వారా ఇక్కడి పేద ముస్లింలకు, స్థానికులకు ఉపాధి కల్పిస్తామని స్పష్టం చేశారు. అయితే ఈ అభివృద్ధి పనులను బీజేపీ, బీఆర్ఎస్ నేతలు అడుగడుగునా అడ్డుకోవాలని చూస్తున్నారని ఆరోపించారు.

# విద్యుత్ స్తంభం ఎక్కిన ఎస్పీడీసీఎల్ సీఎండీ!

**చేవెళ్ల, సెప్టెంబర్ 3 :**



చేవెళ్ల సెక్షన్ పరిధిలోని మల్కారం గ్రామంలో గురువారం నిర్వహించిన బస్తీ బాట కార్యక్రమంలో భాగంగా టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ జితేష్ వి.పాటిల్ విద్యుత్ శాఖ సిబ్బంది క్షేత్ర స్థాయిలో పాటిస్తున్న భద్రతా ప్రమాణాలను ప్రత్యక్షంగా పరిశీలించారు. విద్యుత్ లైన్ల నిర్వహణ, స్తంభాలపై పనులు నిర్వహించే సమయంలో సిబ్బంది అనుసరించాల్సిన భద్రతా విధానాలను స్వయంగా పరిశీలించే ఉద్దేశంతో సీఎండీ విద్యుత్ స్తంభాన్ని ఎక్కి సేఫ్టీ పరికరాల వినియోగం, పని విధానాలు, భద్రతా జాగ్రత్తల అమలును సమీక్షించారు. ఈ సందర్భంగా భద్రత విషయంలో ఎలాంటి రాజీ ఉండరాదని, ప్రతీ ఉద్యోగి తప్పనిసరిగా వ్యక్తిగత రక్షణ పరికరాలు (పీపీఈ) వినియోగించాలని, సేఫ్టీ నిబంధనలను కచ్చితంగా పాటించాలని సీఎండీ సూచించారు. ఉద్యోగుల ప్రాణ భద్రతే సంస్థకు అత్యంత ప్రాధాన్యమని స్పష్టం చేశారు.

**క్యాలెండర్లుఎంచుకోండి**

**పాటిల్ నిబద్ధత ప్రశంసనీయం : డిప్యూటీ సీఎం**

స్వయంగా విద్యుత్ స్తంభం ఎక్కి క్షేత్రస్థాయి పరిస్థితులు, సిబ్బంది భద్రతా ప్రమాణాలను పరిశీలించిన ఎస్పీడీసీఎల్ సీఎండీ జితేష్ వి.పాటిల్ నిబద్ధత ప్రశంసనీయమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కొనియాడారు. క్షేత్రస్థాయిలో అంకితభావంతో విధులు నిర్వర్తిస్తున్న విద్యుత్ సిబ్బంది భద్రతకు ప్రభుత్వం ఎల్లప్పుడూ అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు.

# ఎస్ఐఆర్ నోటీసుల హియరింగ్, పరిష్కారం వేగవంతంగా నిర్వహించాలి

**మేడ్చల్, సెప్టెంబర్ 3 :**

ఈవీఎం, ఓటర్ వెరిఫైయబుల్ పేపర్ ఆడిట్ ట్రయల్(వీవీప్యాట్) భద్రపరిచిన గోదామును వివిధ పార్టీల ప్రతినిధులు, అదనపు ఎన్నికల అధికారి వాసం వెంకటేశ్వర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ మను చౌదరితో కలిసి రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి (సీఈవో) సి.సుదర్శన్ రెడ్డి తనిఖీ చేశారు. అనంతరం ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(ఎసఐఆర్) నోటీసుల హియరింగ్ ప్రక్రియలో భాగంగా గురువారం నర్సీపల్లి, కీసర మండలం, మునీరాబాద్, మేడ్చల్ మండలం దొమ్మర పోచంపల్లి, దుండిగల్ మండలం ప్రాంతాల్లో నిర్వహిస్తున్న ఎసఐఆర్ హియరింగ్ ప్రక్రియను సీఈవో, జిల్లా ఎన్నికల అధికారి పరిశీలించారు. ఓటును నిర్ధారించే ప్రక్రియ, ఎన్నికల సంఘం నిర్ధారించిన ధ్రువీకరణ పత్రాల సమర్పణ, క్షేత్రస్థాయి సహాయం, రికార్డుల పరిశీలన, ధ్రువీకరణ ప్రక్రియను స్వయంగా పరిశీలించారు. జిల్లాలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(ఎసఐఆర్) హియరింగ్ ప్రక్రియను నిబంధనల మేరకు పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించాలని ఈఆర్వోలు, ఏఈఆర్వోలను, సూపర్‌వైజర్లను, బీఎల్‌వోలను సీఈవో ఆదేశించారు. జిల్లాలో మ్యాపింగ్ జరగకుండా ఉన్న ఓటర్లు, ఓటర కార్డులో ఉన్న వ్యత్యాసాల కేటగిరీలకు సంబంధించిన రికార్డులు, దరఖాస్తుల ధ్రువీకరణను పకడ్బందీగా చేపట్టాలని, నోటీసు అందిన ఓటర్లు హియరింగ్‌కు హాజరయ్యే అభ్యర్థుల వివరాలను నిబంధనల ప్రకారం పరిశీలించి అవసరమైన ఆధారాలను ధ్రువీకరించాకనే తదుపరి చర్యలు చేపట్టా లని సూచించారు. అర్హత కలిగిన ఓటర్ల వివరాలు క్రమపద్ధతిలో నమోదయ్యేలా, సంబంధిత పత్రాల పరిశీలనలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. గడువులోగా ప్రక్రియ పూర్తికి తగినంత సిబ్బందిని నియమించి రోజువారీ లక్ష్యాలు, ప్రామాణిక విధానాలు, సమగ్ర కార్యాచరణతో పనులను కొనసాగించాలని సూచించారు. హియరింగ్ నిర్వహణ, దరఖాస్తుల పరిశీలన, అభ్యంతరాల పరిష్కారం తదితర అంశాలను సమీక్షించి ప్రక్రియను నిబంధనల ప్రకారం పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.

# భూ యజమానికి చట్టబద్ధ హక్కులు కల్పించడమే లక్ష్యం

**భద్రాద్రి కొత్తగూడెం, సెప్టెంబర్ 3 :**

రాష్ట్రంలో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడంతోపాటు ప్రతి భూయజమానికి చట్టబద్ధమైన హక్కులు కల్పించడమే తమ ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఐడీఓసీ కార్యాలయంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిధిలోని రెవెన్యూ, భూ రీసర్వే, రిజిస్ట్రేషన్, హౌసింగ్ అంశాలపై గురువారం ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. సీసీఎల్ఏ డి.ఎస్. లోకేశ్ కుమార్, రిజిస్ట్రేషన్ల శాఖ ప్రత్యేక కార్యదర్శి రాజీవ్ గాంధీ హనుమంతు, ప్రజాప్రతినిధులు, కలెక్టర్లతో కలిసి నిర్వహించిన ఈ భేటీలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. సామాన్య ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరిగే అవసరం లేకుండా ధరణి స్థానంలో 'భూ భారతి' చట్టాన్ని పకడ్బందీగా అమలు చేస్తున్నామని మంత్రి తెలిపారు. అధికారాలను కలెక్టర్లు, ఆర్డీవోలు, తహసీల్దార్ల స్థాయికి వికేంద్రీకరించి సేవలను అందుబాటులోకి తెచ్చామన్నారు. ప్రభుత్వం చేపట్టిన భూ రీసర్వేకు హాజరుకాకుండా ప్రైవేట్ సర్వేలకే ప్రాధాన్యమిచ్చే లైసెన్స్‌డ్ సర్వేయర్లకు తక్షణమే నోటీసులు జారీ చేసి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అవసరమైన ప్రత్యామ్నాయ సిబ్బందిని సిద్ధంగా ఉంచాలన్నారు. సబ్ రిజిస్ట్రార్లు, తహసీల్దార్ల పనితీరుపై వస్తున్న వార్తలపై మంత్రి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. అధికారులు తమ వైఖరిని మార్చుకోకపోతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరు లేదా లబ్ధిదారుల ఎంపికలో ఎవరైనా డబ్బులు వసూలు చేసినట్లు తేలితే సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై శాఖాపరమైన, క్రిమినల్ చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రజలకు సంక్షేమ ఫలాలను త్వరితగతిన అందించాలని పిలుపునిచ్చారు.

**ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో వేగం**

మొదటి విడత ఎల్ 1 కేటగిరీ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వెంటనే పూర్తి చేయాలని, పనులు ప్రారంభం కాని వాటిని రెండో విడత జాబితాలోకి మార్చాలని సూచించారు. లబ్ధిదారులకు వెసులుబాటుగా రవాణాతో కలిపి సిమెంట్ బస్తా రూ.230 లకే అందిస్తున్నట్లు వెల్లడించారు.

**అటవీ – రెవెన్యూ సరిహద్దు వివాదాల పరిష్కారం**

దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న అటవీ, రెవెన్యూ భూ సరిహద్దు వివాదాలను శాస్త్రీయ పద్ధతుల్లో కొలతలు వేసి శాశ్వతంగా పరిష్కరించాలని కలెక్టర్లు, ఫారెస్ట్ అధికారులను మంత్రి పొంగులేటి ఆదేశించారు. పోడు రైతులకు ఉచిత విద్యుత్, బోర్ల మంజూరులో ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు.

**రాష్ట్రవ్యాప్తంగా 'జనగామ యాప్' అమలు**

భూ సంబంధిత ప్రక్రియల్లో జనగామ కలెక్టర్ రూపొందించిన ప్రత్యేక యాప్ సత్ఫలితా లు ఇస్తోందని మంత్రి చెప్పారు. దీనిని రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో అమలు చేయాలని అధికారులకు సూచించారు.

# రేవంత్ రెడ్డికి నా మద్దతు.. కాంగ్రెస్‌కు కాదు

- రూ.620 కోట్లతో సైదాబాద్ స్టీల్ ఫ్లైఓవర్
- పాతబస్తీ ట్రాఫిక్ కష్టాలకు పరిష్కారం
- బీఆర్ఎస్ హయాంలో పనులు నిలిచిపోయాయి
- రేవంత్ రెడ్డి నిధులు కేటాయించి పూర్తి చేశారు
- జేబీఎస్–ఫలక్‌నూమా మెట్రోపై ఓవైసీ ధీమా

**హైదరాబాద్, సెప్టెంబర్ 4:**

హైదరాబాద్‌లో నల్లగొండ ఎక్స్ రోడ్ నుంచి సంతోష్‌నగర్ ఓవైసీ జంక్షన్ వరకు రూ.620 కోట్లతో నిర్మించిన సైదాబాద్ స్టీల్ ఫ్లైఓవర్‌ను ప్రారంభించారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ పాల్గొని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఫ్లైఓవర్ అందుబాటులోకి రావడంతో సంతోష్‌నగర్, డీఆర్‌డీవో మార్గాల్లో ప్రయాణించే పాతబస్తీ ప్రజల ట్రాఫిక్ కష్టాలు తీరుతాయని అన్నారు.

**బీఆర్ఎస్ హయాంలో నిధులు ఇవ్వలేదు**

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఫ్లైఓవర్‌కు శంకుస్థాపన చేసినప్పటికీ పనులు పూర్తి చేసేందుకు నిధులు విడుదల చేయలేదని అసదుద్దీన్ ఓవైసీ విమర్శించారు. బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని పలుమార్లు కోరినా పట్టించుకోలేదన్నారు. కాంట్రాక్టర్‌ను పనులు నిలిపివేసి మరోచోటకు వెళ్లాలని చెప్పిన పరిస్థితి కూడా ఉందని తెలిపారు.

**రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు**

రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఫ్లైఓవర్ నిర్మాణానికి రూ.620 కోట్లు కేటాయించి పనులను వేగంగా పూర్తి చేయించారని ఓవైసీ తెలిపారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.

**ఫలక్‌నూమా మెట్రో పూర్తి చేస్తారు**

జూబ్లీ బస్‌స్టేషన్ నుంచి ఫలక్‌నూమా వరకు మెట్రో విస్తరణ ప్రాజెక్టును కూడా త్వరలో పూర్తి చేస్తారన్న విశ్వాసాన్ని అసదుద్దీన్ వ్యక్తం చేశారు. రేవంత్‌రెడ్డి సీఎం కాకముందే ఫలక్‌నూమా ప్రజలకు హామీ ఇచ్చారని, సీఎం అయ్యాక తనతో కలిసి మెట్రో రైలులో ఫలక్‌నూమాకు ప్రయాణిస్తామని చెప్పారని గుర్తుచేశారు. ఆ హామీని రేవంత్‌రెడ్డి తప్పకుండా నెరవేరుస్తారని అన్నారు.



**రేవంత్‌కు మద్దతు.. కాంగ్రెస్‌కు కాదు**

కార్యక్రమంలో ఉన్న కాంగ్రెస్ నేతలను ఉద్దేశించి అసదుద్దీన్ ఓవైసీ కీలక వ్యాఖ్యలు చేశారు. తాను రేవంత్‌రెడ్డికి మద్దతు ఇస్తున్నానని, కాంగ్రెస్ పార్టీకి కాదని స్పష్టం చేశారు. రేవంత్‌రెడ్డి నాయకత్వంలో హైదరాబాద్, తెలంగాణ వేగంగా అభివృద్ధి చెందుతున్నాయని అన్నారు. సీఎం తన సొంత శైలిలో పాలనను కొనసాగిస్తూ అభివృద్ధిలో తెలంగాణను దేశంలో ప్రత్యేకంగా నిలబెట్టాలని ఆకాంక్షించారు.

# రెండు రోజులపాటు కొడంగల్‌లో సీఎం రేవంత్ పర్యటన

**హైదరాబాద్, సెప్టెంబర్ 3 :**

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శుక్ర, శనివారాలు రెండు రోజులపాటు కొడంగల్ నియోజకవర్గంలో పర్యటించనున్నారు. శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు మద్దూరులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల, నిర్మాణంలో ఉన్న సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ పనులను తనిఖీ చేయనున్నారు. మధ్యాహ్నం 3.20 గంటలకు దౌల్తాబాద్ మండలం గోకఫసల్వాడ్‌లో నిర్మాణంలో ఉన్న బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ పనులను, సాయంత్రం 4 గంటలకు దౌల్తాబాద్ పట్టణంలో నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాల పనులను పరిశీలిస్తారు. సాయంత్రం 4.30 గంటలకు హకీంపేట ఎడ్యుకేషన్ హబ్ పనులను పరిశీలించనున్న సీఎం అక్కడే నియోజకవర్గ అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించనున్నారు. సమీక్ష అనంతరం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రోడ్డు మార్గాన కొడంగల్‌లోని నివాసానికి చేరుకుని అక్కడే బస చేయనున్నారు.

# ప్రజలకు సీఎం శ్రీకృష్ణ జన్మాష్టమి శుభాకాంక్షలు

**హైదరాబాద్, సెప్టెంబర్ 3 :**

శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. భగవద్గీత బోధనలు మానవ జీవితానికి మార్గదర్శకమని అన్నారు. శ్రీకృష్ణుడి తత్వాన్ని అర్థం చేసుకుని, ఆయన బోధనలను ఆచరిస్తే జీవితంలో ప్రతి పనిలో విజయాన్ని సాధించవచ్చని అన్నారు. శ్రీకృష్ణుడి కృపా కటాక్షాలు రాష్ట్ర ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని ముఖ్యమంత్రి ప్రార్థించారు.

# భద్రాద్రికి త్వరలో రైలు కూత !

- పాండురంగాపురం – సాకేతపురి పనులకు మోక్షం
- ఆధ్యాత్మిక, పారిశ్రామిక ప్రగతికి సరికొత్త మార్గం
- మంత్రి తుమ్మల విజ్ఞప్తికి కేంద్రం ఓకే

**భద్రాద్రి కొత్తగూడెం సెప్టెంబర్ 3 :**

జిల్లా అభివృద్ధికి కీలకమైన పాండురంగాపురం-మల్కనగిరి రైల్వే లైన్ కు మరోసారి కదలిక వచ్చింది. వివిధ కారణాలతో పూర్తి ప్రాజెక్టు ఆలస్యమవుతున్న నేపథ్యంలో... ప్రస్తుత దశలో పాండురంగాపురం నుంచి మధ్యలోని సాకేతపురి (సారపాక) వరకు సుమారు 16 కి.మీ. రైల్వే లైన్ పనులను ముందుగా చేపట్టి త్వరితగతిన పూర్తి చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణన్ను కోరారు. మంత్రి తుమ్మల విజ్ఞప్తిపై కేంద్ర రైల్వే మంత్రి సానుకూలంగా స్పందించి, ఈ మార్గం లో పనులను వేగవంతం చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

**పూర్తి ప్రాజెక్టుకు పలు అవరోధాలు**

రైల్వే మంత్రితో జరిగిన చర్చలో పాండురంగాపురం మల్కనగిరి లైన్ ప్రస్తుత పరి స్థితిని మంత్రి తుమ్మల వివరించారు. గతంలో రైల్వే మంత్రులుగా పనిచేసిన లాలూ ప్రసాద్ యాదవ్, మమతా బెనర్జీ, సురేశ్ ప్రభు, పీయూష్ గోయల్ హయాంలోనూ ఈ రైల్వే లైన్ ప్రతిపాదనకు అనుకూలత లభించినప్పటికీ వివిధ కారణాలతో పనులు పూర్తిస్థాయిలో ముందుకు సాగలేదని తెలిపారు. భూసేకరణ, అటవీ అనుమతులు, గోదావరి వంతెనతోపాటు ఇతర రైల్వే వంతెనల నిర్మాణానికి సంబంధించిన ప్రక్రియలు పూర్తి ప్రాజెక్టుకు ప్రధాన అవరోధాలుగా ఉన్నాయని మంత్రి వివరించారు. ఈ అంశాలన్నింటినీ పరిష్కరించి పాండురంగాపురం మల్క నగిరి పూర్తి రైల్వే లైన్ నిర్మించేందుకు కొంత సమయం పట్టే అవకాశం ఉందన్నారు.

**సాకేతపురి వరకు ముందుగా పనులు**

పాండురంగాపురం నుంచి సాకేతపురి (సారపాక) వరకు సుమారు 16 కి.మీ మేర లైన్ నిర్మాణానికి పెద్దగా అవరోధాలు లేనందున ఈ దశలో ఆ పనులను ముందుగా చేపట్టి త్వరితగతిన పూర్తిచేయాలని మంత్రి తుమ్మల కోరారు. పాండురంగాపురంసాకేతపురి మధ్య రైల్వే లైను అవసరమైన భూ సేకరణ ప్రక్రియను రాష్ట్ర ప్రభుత్వం చేపట్టి భూమిని రైల్వే శాఖకు అప్పగించేందుకు సిద్ధంగా ఉందని కేంద్ర మంత్రికి తెలిపారు.

**భక్తులకు మరింత చేరువలో భద్రాచలం**

దక్షిణ అయోధ్యగా పేరొందిన భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయానికి దేశ నలుమూలల నుంచి వచ్చే భక్తులకు ఈ రైల్వే మార్గం ఎంతో ప్రయోజనకరంగా మారనుంది. సాకేతపురి వరకు రైల్వే సౌకర్యం అందుబాటులోకి వస్తే భద్రాచలం ప్రాంతానికి రాకపో కలు సులభతరం కానున్నాయి. రైల్వే కనెక్టివిటీతో భద్రాచలంలో ఆధ్యాత్మిక పర్యాటకానికి కొత్త ఊపు వచ్చే అవకాశం ఉంది. భద్రాచలం, గోదావరి పరివాహక ప్రాంతాల్లో పర్యాటక కార్యకలాపాలు విస్తరించడంతోపాటు భక్తులు, పర్యాటకుల రాక పెరగడం ద్వారా స్థానికంగా ఉపాధి, వ్యాపార అవకాశాలు మెరుగుపడనున్నాయి.

**పారిశ్రామిక రంగానికి రవాణా బలం**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని పారిశ్రామిక రంగానికి కూడా రైల్వే కనెక్టివిటీ కీలకంగా మారనుంది. సింగరేణి, బీపీఎల్, వాటర్ ప్లాంట్లు, కేటీపీఎస్ తదితర పరిశ్రమలకు ముడిసరకు, ఉత్పత్తుల రవాణా మరింత సులభతరం కానుంది. రైల్వే సౌకర్యం అందుబాటులోకి రావడంతో పెట్టుబడులు ఆకర్షించేందుకు అనుకూల వాతావరణం ఏర్పడనుంది.

# సాగర్ నీటిని విడుదల చేయాలి

**మిర్యాలగూడ, సెప్టెంబర్ 3:**



నాగార్జునసాగర్ నుంచి సాగునీటిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆధ్వర్యంలో మిర్యాలగూడలో రైతు ధర్నా నిర్వహించారు. NSP గ్రౌండ్‌లో జరిగిన ఈ ఆందోళనలో కేటీఆర్ పాల్గొని కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. కాంగ్రెస్ పాలన ప్రారంభమై వెయ్యి రోజులు అవుతున్నా రైతుల పరిస్థితి మరింత దారుణంగా మారిందని ఆరోపించారు. బీఆర్ఎస్ ధర్నాను అడ్డుకునేందుకు ప్రభుత్వం కుట్రలు, కుతంత్రాలు చేసిందని, అయినప్పటికీ రైతులు తరలివచ్చి మద్దతుగా నిలిచారని అన్నారు.

**రైతు డిక్లరేషన్‌ను గాలికి వదిలేశారు**

బీఆర్ఎస్ హయాంలో తెలంగాణ దేశానికే ధాన్యాగారంగా నిలిచిందని కేటీఆర్ అన్నారు. ఆ సమయంలో రైతులు ధీమాగా బతికారని, ప్రస్తుతం కాంగ్రెస్ పాలనలో కళ్లముందే పంటలు ఎండిపోతున్నాయని విమర్శించారు. రైతు డిక్లరేషన్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం గాలికి వదిలేసిందని ఆరోపించారు. యూరియా కష్టాలు మళ్లీ మొదలయ్యాయని, రైతుబంధు, రైతుబీమా పథకాలను నిర్వీర్యం చేశారని మండిపడ్డారు.

**మూడుసార్లు రైతుబంధు ఇవ్వలేదు**

ఎన్నికల సమయంలో కేసీఆర్ చెప్పిన విషయాలే ఇప్పుడు నిజమవుతున్నాయని కేటీఆర్ వ్యాఖ్యానించారు. కాంగ్రెస్‌కు ఓటేసిన పాపానికి రైతులకు మూడుసార్లు రైతుబంధు నిధులు ఇవ్వలేదని ఆరోపించారు. రుణమాఫీ కూడా సంపూర్ణంగా జరగలేదన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయాలని ప్రభుత్వాన్ని గల్లా పట్టి అడుగుతామని, నిలదీస్తామని స్పష్టం చేశారు.

**మంత్రులు విఫలమయ్యారు**

సాగునీటి విడుదల విషయంలో ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన మంత్రులు విఫలమయ్యారని కేటీఆర్ విమర్శించారు. ఇద్దరు మంత్రులు ఉమ్మడి జిల్లాకు శనిలా దాపురించారని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ హయాంలో శ్రీశైలం నీటిమట్టం 875 అడుగులకు చేరగానే సాగర్‌కు నీటిని విడుదల చేయించామని గుర్తుచేశారు.

**సాగర్‌లో నీళ్లున్నా విడుదల చేయరా?**

ప్రస్తుతం వానాకాలం సీజన్‌కు సరిపడా నాగార్జునసాగర్‌లో నీళ్లు ఉన్నప్పటికీ ప్రభుత్వం సాగునీటిని విడుదల చేయడం లేదని కేటీఆర్ ఆరోపించారు. ఎడమ కాలువ ఆయకట్టు రైతులు ఏం పాపం చేశారని ప్రశ్నించారు. ఎడమ కాలువ ఆయకట్టు ప్రజలపై ప్రభుత్వం పగబట్టినట్టుగా వ్యవహరిస్తోందని విమర్శించారు.

**వెలిగొండకు నీళ్ల తరలింపు**

మిగులు జలాల ఆధారంగా వెలిగొండ ప్రాజెక్టును నిర్మించారని కేటీఆర్ అన్నారు. వెలిగొండ నుంచి నీళ్లు వెళ్తున్నా సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. వెలిగొండకు నీళ్లు తరలించడం గురుదక్షిణగా మారిందని, సీఎం మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు.

**పది రోజుల్లో షెడ్యూల్ ఇవ్వాలి**

ఓటుకు నోటు కేసు నుంచి తప్పించుకోవడానికే సీఎం రేవంత్‌రెడ్డి మౌనం వహిస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీకి ఓటేసినందుకు రైతులు ఇబ్బందులు పడాల్సి వస్తోందన్నారు. సాగునీటి విడుదలపై ప్రభుత్వం వెంటనే షెడ్యూల్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. వినాయక చవితిలోగా సాగునీటి విడుదల షెడ్యూల్ ఇవ్వకపోతే కోదాడ నుంచి హాలియా వరకు పాదయాత్ర చేపడతానని హెచ్చరించారు. పది రోజుల్లోగా షెడ్యూల్ రాకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు.

# రేపటినుంచి ధనీ హుజూర్ స్వామీజీ పవిత్ర భండారా ఉత్సవం

**దయాల్‌బాగ్ (ఆగ్రా), సెప్టెంబర్ 3:**

రాధాస్వామి మత ప్రవర్తకులు, మొదటి సంత్ సత్‌గురువు అయిన పూరన్ ధనీ హుజూర్ స్వామీజీ మహారాజ్ జయంతి సందర్భంగా శుక్రవారం జన్మాష్టమిని పురస్కరించుకొని పవిత్ర భండారా ఉత్సవాన్ని ఆగ్రాలోని దయాల్‌బాగ్ లో భక్తిశ్రద్ధలతో నిర్వహించనున్నట్టు మీడియా అధికారి జితేంద్ర కాంత్ శర్మ ఒక ప్రకటనలో తెలిపారు. హుజూర్ స్వామీజీ మహారాజ్ 1818 ఆగస్టు 2425 మధ్య పవిత్ర జన్మాష్టమి రాత్రి ఆగ్రాలోని పన్నీ గలీలో సేఠ్ శివ్ దయాల్ సింగ్ జీ గా అవతరించారు. ఆయన జీవుల ఉద్ధరణకు నిజ్ ఘర్ ప్రాప్తికి ప్రత్యక్ష మార్గమైన సూరత్‌శబ్దయోగాన్ని ప్రకాశింపజేసి, 1861 ఫిబ్రవరి 15 వసంత పంచమి రోజున సర్వసాధారణ సత్సంగీయులకు రాధాస్వామి సత్సంగ ద్వారాలను తెరిచారు. కాగా సెప్టెంబర్ 2 నుండి 6 వరకు భండారా వారం జరుపుకుంటారు. సెప్టెంబర్ 4న దేశవిదేశాల్లోని వివిధ శాఖలలో కూడా అత్యంత భక్తితో నిర్వహిస్తారు. ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, పశ్చిమ బెంగాల్, ఒడిశా, తూర్పు రాష్ట్రాలు మరియు యూరప్ నుండి అనుమతించబడిన శాఖల సత్సంగీ సోదర సోదరీమణులు మరియు రిజిస్టర్డ్ జిజ్ఞాసులు దయాల్‌బాగ్‌కు విచ్చేయనున్నారు. శుక్రవారం ఉదయం పవిత్ర ఆరతి మరియు రెండవ సెషన్‌లో పొలాలలో పవిత్ర భండారా నిర్వహించబడుతుందని జితేంద్రకాంత్ శర్మ వివరించారు.

# వరదల్లో 91 ఏళ్ల వృద్ధురాలి పోరాటం

- **రెండు గంటలపాటు బురద నీటిలోనే**

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 3 :**

నేపాల్‌ను అతలాకుతలం చేస్తున్న వరదల్లో 91 ఏళ్ల వృద్ధురాలి పోరాటం ప్రపంచం దృష్టిని ఆకర్షిస్తోంది. మెడ వరకు బురదలో కూరుకుపోయి, జేసీబీ స్కూప్‌లో కూర్చుని ఉన్న గుణ మాయ బోహరా చిత్రం ఈ విపత్తులో ఆశకు, మొక్కవోని సంకల్పానికి ప్రతీకగా నిలిచింది. నువాకోట్‌లోని దేవీఘాట్‌లో ఉన్న సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ ఫౌండేషన్ వృద్ధాశ్రమంలో ఈ సంఘటన చోటుచేసుకుంది. ఆశ్రమంలోని వారు అల్పాహారం తీసుకుంటున్న సమయంలో ఆకస్మిక వరదలు ముంచెత్తాయి. చాలామంది పై అంతస్తులకు పరుగులు తీసినప్పటికీ కొందరు తప్పించుకోలేకపోయారు. ఈ దుర్ఘటనలో ఏడుగురు వృద్ధులు ప్రాణాలు కోల్పోయారు. కింది అంతస్తులోని గదిలో ఉన్న గుణ మాయ బోహరా వరద నీరు వేగంగా గదిలోకి వస్తున్నా ధైర్యం కోల్పోలేదు. కాళ్లకు సంబంధించిన అనారోగ్య సమస్యలు ఉన్నప్పటికీ కిటికీ తలుపులు తెరిచి రెండు నుంచి మూడు గంటలపాటు బురద నీటిలో తన తలను పైకి ఉంచి ప్రాణాలతో నిలిచారు. స్థానిక వలంటీర్లు ఆమెను గుర్తించి సురక్షితంగా వెలికితీశారు. అనంతరం ఆమెను, మిగిలిన వారిని ఖాట్మండులోని ఒక తాత్కాలిక శిబిరానికి తరలించారు. ప్రస్తుతం వారంతా ఆహారం, వైద్య సదుపాయాలతో క్షేమంగా ఉన్నారు. ఈ వరదల వల్ల నేపాల్‌లో ఇప్పటివరకు 1,252 మంది మరణించినట్లు అధికారిక గణాంకాలు వెల్లడిస్తున్నాయి. నేపాల్‌లో సుమారు 4,216 మంది, టిబెట్‌లో మరో 541 మంది గల్లంతయ్యారు.

# జగన్నాథుని ఖాతాల్లో రూ.1,912 కోట్లకు పైగా

- **ఆలయ బ్యాంకు డిపాజిట్ల వివరాలు వెల్లడి**
- **నిధుల నిర్వహణలో అత్యున్నత పారదర్శకత**
- **రూ.1,811 కోట్లు మూడు విభాగాల్లో ఫిక్స్డ్ డిపాజిట్లు**
- **రోజువారీ హుండీ కానుకల లెక్కింపు**
- **'సమర్పణ్' డిజిటల్ హుండీకి రూ.56.7 లక్షల విరాళాలు**

**పూరీ, సెప్టెంబర్ 4:**

అయోధ్య రామ్ మందిర విరాళాల దుర్వినియోగంపై ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో పూరీ జగన్నాథ ఆలయ యాజమాన్య సంస్థ బ్యాంకు నిధుల వివరాలను అధికారికంగా వెల్లడించింది. ఆగస్టు 31, 2026 నాటికి శ్రీ జగన్నాథుని పేరిట రూ.1,912 కోట్లకు పైగా బ్యాంకు ఆస్తులు ఉన్నట్లు తెలిపింది. ఆలయ నిధుల నిర్వహణ అత్యున్నత పారదర్శకతతో జరుగుతోందని ఎస్‌జేటీఏ చీఫ్ అడ్మినిస్ట్రేటర్ అరవింద కుమార్ పఢీ స్పష్టం చేశారు. క్రమబద్ధమైన ఆడిటింగ్, అకౌంటింగ్ విధానాలను అనుసరిస్తున్నామని, భక్తుల విశ్వాసాన్ని కాపాడేందుకు స్పష్టమైన జవాబుదారీతనం అమలు చేస్తున్నామని తెలిపారు.

**మూడు విభాగాల్లో ఫిక్స్డ్ డిపాజిట్లు**

ఆలయానికి భక్తుల కానుకలు, విరాళాలతో పాటు గనులు, క్వారీల ఆదాయం, ఫిక్స్డ్ డిపాజిట్లపై వచ్చే వడ్డీ, భూముల లావాదేవీల ఆదాయం, ప్రభుత్వ గ్రాంట్లు ప్రధాన వనరులుగా ఉన్నాయి. వీటిలో కొంత మొత్తాన్ని కార్పస్ ఫండ్, ఫౌండేషన్ ఫండ్, టెంపుల్ ఫండ్ పేర్లతో మూడు విభాగాల్లో ఫిక్స్డ్ డిపాజిట్లుగా జమ చేస్తున్నారు. ఈ డిపాజిట్లపై వచ్చే వడ్డీని రోజువారీ పూజలు, సంప్రదాయ సేవలు, ఆలయ పరిపాలనా వ్యయాలకు వినియోగిస్తున్నారు.

**రూ.1,811 కోట్లు డిపాజిట్ల రూపంలో**

ఆలయానికి ఉన్న మొత్తం బ్యాంకు ఆస్తుల్లో సుమారు రూ.1,811 కోట్లు కార్పస్, ఫౌండేషన్, టెంపుల్ డిపాజిట్ల రూపంలో ఉన్నాయి. మరో రూ.100 కోట్లకు పైగా సేవింగ్స్, కరెంట్, ఫ్లెక్సీ ఖాతాల్లో ఉన్నట్లు ఎస్‌జేటీఏ వెల్లడించింది. 2024 జూన్‌లో ఒడిశా ప్రభుత్వం అందించిన రూ.500 కోట్ల కార్పస్ ఫండ్ కూడా ఇందులో భాగంగా ఉంది.

**హుండీ లెక్కలు డిజిటల్‌గా**

ఆలయ హుండీలో లభించే కానుకలను ప్రతిరోజూ లెక్కిస్తున్నారు. వాటి వివరాలను డిజిటల్ బోర్డులతో పాటు అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచుతున్నారు. దీంతో ఆలయానికి వచ్చే విరాళాల విషయంలో పారదర్శకతను కొనసాగిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

**'సమర్పణ్'కు రూ.56.7 లక్షలు**

ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ జూలై 15న ప్రారంభించిన 'సమర్పణ్' డిజిటల్ హుండీ ద్వారా ఇప్పటివరకు భక్తులు రూ.56.7 లక్షల విరాళాలు అందించారు. ఆలయ నిధుల దుర్వినియోగంపై ప్రస్తుతం ఎలాంటి ఫిర్యాదులు లేనప్పటికీ భద్రతా చర్యలను మరింత కఠినతరం చేసినట్లు అధికారులు తెలిపారు.



# 'రేప్ కేసుల సెటిల్‌మెంట్ దందా'.. పంజాబ్‌లో రాజకీయ దుమారం

- **సీఎం మాన్, ఆయన భార్యపై బీజేపీ తీవ్ర ఆరోపణలు**
- **ఒక్కో కేసుకు రూ.5 కోట్లు డిమాండ్ చేస్తున్నారని వ్యాఖ్య**
- **ఆడియో క్లిప్పులు విడుదల చేసిన ప్రదీప్ భండారీ**
- **ఆరోపణలను ఖండించిన గుర్‌ప్రీత్ కౌర్**
- **దర్యాప్తు వ్యవహారంపై హైకోర్టు ఆదేశాలు**



**చండీగఢ్:**

పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్, ఆయన భార్య గుర్‌ప్రీత్ కౌర్‌పై బీజేపీ తీవ్ర ఆరోపణలు చేసింది. అత్యాచారం సహా క్రిమినల్ కేసులను మధ్యవర్తుల ద్వారా డబ్బులు తీసుకుని సెటిల్ చేస్తున్నారంటూ బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి ప్రదీప్ భండారీ ఆరోపించారు. ఒక్కో కేసు పరిష్కారానికి రూ.5 కోట్ల వరకు డిమాండ్ చేస్తున్నారని పేర్కొన్నారు. అయితే ఈ ఆరోపణలను గుర్‌ప్రీత్ కౌర్ తీవ్రంగా ఖండించారు.
గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో ప్రదీప్ భండారీ కొన్ని ఆడియో క్లిప్పులను విడుదల చేశారు. వాటిలో ఓ వ్యక్తి తనకున్న రాజకీయ పరిచయాలను ప్రస్తావిస్తూ అత్యాచారం, ఇతర క్రిమినల్ కేసులను సెటిల్ చేయడం గురించి మాట్లాడినట్లు ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ ఆడియోల ప్రామాణికత, వాటిలోని సంభాషణలకు ముఖ్యమంత్రి లేదా ఆయన కుటుంబంతో ప్రత్యక్ష సంబంధం ఉందా అన్న అంశాలు అధికారికంగా నిర్ధారణ కావాల్సి ఉంది.

**'రూ.5 కోట్లకు సెటిల్ చేస్తున్నారా?'**

మధ్యవర్తుల ద్వారా కేసులను రూ.5 కోట్లకు సెటిల్ చేస్తున్నారని భండారీ ఆరోపించారు. ముఖ్యమంత్రి వ్యక్తిగతంగా కేసుల విషయంలో జోక్యం చేసుకుంటున్నారా? ముఖ్యమంత్రి నివాసం కేంద్రంగా ఏమైనా ఒప్పందాలు జరుగుతున్నాయా? అంటూ ప్రశ్నించారు. ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్‌పైనా ఆయన ఆరోపణలు చేశారు. అయితే ఈ ఆరోపణలకు సంబంధించి బీజేపీ నేత చేసిన వ్యాఖ్యలకు స్వతంత్ర నిర్ధారణ లేదు.

**ఏమిటీ కేసు?**

సామాజిక మాధ్యమ ప్రభావశీలి గుర్విందర్ సింగ్ చాహల్‌కు సంబంధించిన అత్యాచారం కేసు నేపథ్యంలో తాజా రాజకీయ ఆరోపణలు తెరపైకి వచ్చాయి. ఓ మహిళను అపహరించి అత్యాచారం చేశారన్న ఆరోపణలపై చాహల్‌పై కేసు నమోదైంది. ఏప్రిల్ 29న అమృత్‌సర్‌లో కేసు నమోదు కాగా, మే 1న బాధితురాలిని పోలీసులు గుర్తించినట్లు సమాచారం. అనంతరం అత్యాచారం ఆరోపణలను కేసులో చేర్చారు. మే 13న చాహల్‌ను అరెస్టు చేయగా.. తర్వాత ఆయన విడుదల కావడంతో దర్యాప్తు తీరుపై రాజకీయ విమర్శలు మొదలయ్యాయి. బాధితురాలి తండ్రి పంజాబ్-హర్యానా హైకోర్టును ఆశ్రయించి దర్యాప్తుపై అనుమానాలు వ్యక్తం చేశారు. దీంతో జూలై 20న గత దర్యాప్తుతో సంబంధం లేకుండా సీనియర్ పోలీసు అధికారితో విచారణ చేపట్టాలని న్యాయస్థానం ఆదేశించినట్లు సమాచారం.

**మానవ హక్కుల కమిషన్ దృష్టికి**

కేసును సెటిల్ చేసేందుకు రూ.5 కోట్లు డిమాండ్ చేశారన్న ఆరోపణలు ఆగస్టులో జాతీయ మానవ హక్కుల కమిషన్ దృష్టికి వెళ్లాయి. దీనిపై విచారణ జరిపి తీసుకున్న చర్యల నివేదిక సమర్పించాలని పంజాబ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీని కమిషన్ ఆదేశించినట్లు సమాచారం. మరోవైపు తనపై వస్తున్న ఆరోపణలను సీఎం భగవంత్ మాన్ భార్య గుర్‌ప్రీత్ కౌర్ ఖండించారు. ముఖ్యమంత్రిని లక్ష్యంగా చేసుకునేందుకే తనపై నిరాధార ఆరోపణలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ వ్యవహారంలో మధ్యవర్తిగా ఆరోపణలు ఎదుర్కొంటున్న సిమ్రంజిత్ సింగ్ హుండాల్ కూడా తాను గుర్‌ప్రీత్ కౌర్‌ను ఎప్పుడూ కలవలేదని స్పష్టం చేశారు. బీజేపీ చేస్తున్న తీవ్ర ఆరోపణలు, మరోవైపు వాటిని సీఎం కుటుంబం ఖండిస్తున్న నేపథ్యంలో.. ఆడియో క్లిప్పుల ప్రామాణికతతో పాటు రూ.5 కోట్ల 'సెటిల్‌మెంట్' ఆరోపణల్లో వాస్తవాలేమిటన్నది అధికారిక దర్యాప్తులో తేలాల్సి ఉంది.

# రామ మందిరం ట్రస్ట్ సీఈఓ నియామకంపై వివాదం

- **జితేంద్ర మిశ్రా నియామకంపై కాంగ్రెస్ అనుమానాలు**
- **'ఆపరేషన్ సిందూర్ రహస్యమే కారణమా?'**
- **కేంద్రం నియామక విధానంపై రషీద్ అల్వీ ప్రశ్నలు**
- **కాంగ్రెస్ వ్యాఖ్యలపై బీజేపీ ఎదురుదాడి**
- **సైన్యాన్ని, సనాతన ధర్మాన్ని అవమానిస్తున్నారని ఆరోపణ**



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 4:**

అయోధ్య రామ జన్మభూమి టెంపుల్ ట్రస్ట్ కొత్త సీఈఓగా మాజీ ఎయిర్ మార్షల్ జితేంద్ర మిశ్రా నియామకంపై రాజకీయ వివాదం మొదలైంది. ఆయన నియామకంపై కాంగ్రెస్ నేత రషీద్ అల్వీ అనుమానాలు వ్యక్తం చేశారు. 'ఆపరేషన్ సిందూర్'కు సంబంధించిన ఏదైనా రహస్యం కారణమై ఉండొచ్చా? అంటూ ప్రశ్నించారు. మాజీ ఎయిర్ చీఫ్‌ను రామ మందిర ట్రస్ట్ సీఈఓగా నియమించాల్సిన అవసరం ఏముందని నిలదీశారు.

**నియామక విధానంపై ప్రశ్నలు**

కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న నియామక విధానాన్ని కూడా అల్వీ ప్రశ్నించారు. మాజీ సుప్రీంకోర్టు న్యాయమూర్తులను గవర్నర్లుగా, రాజ్యసభ సభ్యులుగా నియమిస్తున్నారని, ఇప్పుడు రిటైర్డ్ ఎయిర్ చీఫ్‌ను రామ మందిర ట్రస్ట్ సీఈఓగా నియమించారని అన్నారు. రామ మందిరంతో మాజీ ఎయిర్ చీఫ్‌కు ఉన్న సంబంధం ఏమిటని ప్రశ్నించారు. ఆపరేషన్ సిందూర్‌కు సంబంధించిన నిగూఢమైన రహస్యం కారణంగానే జితేంద్ర మిశ్రా నియామకం జరిగి ఉండొచ్చని తాను అనుమానిస్తున్నట్లు చెప్పారు.

**అక్రమాలపై వివరాలు వెల్లడించలేదని ఆరోపణ**

రామ మందిరానికి సంబంధించి గతంలో జరిగినట్లు ఆరోపణలు వచ్చిన అక్రమాలపై ఇప్పటివరకు పూర్తి వివరాలు వెల్లడించలేదని రషీద్ అల్వీ ఆరోపించారు. ఈ వ్యవహారాల్లో బాధ్యులందరినీ అరెస్టు చేయలేదని అన్నారు. బీజేపీ ప్రభుత్వం, ప్రధాని నరేంద్ర మోదీ అనుసరిస్తున్న విధానాలు దేశానికి నష్టం చేస్తున్నాయని విమర్శించారు.


**కాంగ్రెస్‌పై బీజేపీ ఎదురుదాడి**

రషీద్ అల్వీ వ్యాఖ్యలపై బీజేపీ ఘాటుగా స్పందించింది. పార్టీ అధికార ప్రతినిధి రాకేష్ త్రిపాఠి కాంగ్రెస్‌పై ఎదురుదాడి చేశారు. కాంగ్రెస్‌కు సనాతన ధర్మాన్ని, భారత సైన్యాన్ని అవమానించడమే అలవాటుగా మారిందని ఆరోపించారు. బాబ్రీ మసీదు అంశం నుంచి సర్జికల్ స్ట్రైక్స్ వరకు కాంగ్రెస్ గతంలో చేసిన వ్యాఖ్యలను ప్రస్తావించారు. రామ మందిర ట్రస్ట్ సీఈఓగా మాజీ ఎయిర్ మార్షల్ నియామకాన్ని కూడా కాంగ్రెస్ ప్రశ్నించడం ఆ పార్టీ వైఖరికి నిదర్శనమని త్రిపాఠి విమర్శించారు. బాబ్రీ అంశంలో కాంగ్రెస్ మద్దతు ఇచ్చిందని, ఆర్మీ చీఫ్‌ను అవమానించిందని, సర్జికల్ స్ట్రైక్స్‌కు ఆధారాలు అడిగిందని ఆరోపించారు. ఇప్పుడు రామ జన్మభూమి ట్రస్ట్ సీఈఓ నియామకంపైనా ప్రశ్నలు లేవనెత్తుతోందని మండిపడ్డారు.

# నల్సార్ వర్సిటీ విద్యార్థులకు భారీ ఊరట

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 3 :**

న్యాయ విద్యార్థులపై క్రమశిక్షణ చర్యలు తీసుకునే చట్టపరమైన అధికారం భారత బార్ కౌన్సిల్ (బీసీఐ)కు లేదని సుప్రీంకోర్టు గురువారం స్పష్టం చేసింది. ఈమేరకు నల్సార్ యూనివర్సిటీ విద్యార్థులకు భారీ ఊరటనిస్తూ కీలక తీర్పు వెలువరించింది. బీసీఐ అధికార పరిధి కేవలం న్యాయవాదులుగా నమోదైన వారికి మాత్రమే పరిమితమని, విద్యార్థి దశలో ఉన్న వారికి ఇది వర్తించదని ధర్మాసనం తేల్చి చెప్పింది. నల్సార్ యూనివర్సిటీ స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిగా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్‌ను ఆహ్వానించడాన్ని వ్యతిరేకిస్తూ కొందరు విద్యార్థులు లేఖ రాశారు. దీనిపై తీవ్రంగా స్పందించిన బీసీఐ చైర్మన్ మనన్ కుమార్ మిశ్రా.. మూడు రోజుల్లోగా నివేదిక సమర్పించాలని నల్సార్ వైస్‌ఛాన్సలర్‌ను ఆదేశించారు. అంతటితో ఆగకుండా నల్సార్ 2026 బ్యాచ్‌కు చెందిన ఏ విద్యార్థినీ న్యాయవాదిగా నమోదు చేసుకోవద్దని దేశంలోని అన్ని రాష్ట్రాల బార్ కౌన్సిళ్లకు సర్క్యులర్ జారీ చేశారు. ఈ నిర్ణయంపై సర్వత్రా విమర్శలు రావడంతో మనన్ కుమార్ మిశ్రా ఆ ఉత్తర్వులను ఉపసంహరించుకున్నారు. అయినా ఈ అంశాన్ని సుప్రీంకోర్టు సుమోటోగా స్వీకరించి విచారణ చేపట్టింది. విచారణ సందర్భంగా బీసీఐ వైఖరిని తీవ్రంగా తప్పుబట్టిన ధర్మాసనం పై విధంగా తీర్పునిచ్చింది.




# బైక్ ట్యాక్సీలకు అనుమతించండి

- **రాష్ట్ర ప్రభుత్వాలకు నితిన్ గడ్కరీ సూచన**
- **8 కోట్ల మందికి ఉపాధి అవకాశాలు**
- **అనుమతులు రాష్ట్రాల నిర్ణయంపైనే**
- **ట్రాఫిక్ ఉల్లంఘనలకు నెగెటివ్ పాయింట్లు**
- **డ్రైవర్ల ఆరోగ్యంపై 'సురక్ష' కార్యక్రమం**

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 4:**

ప్రైవేట్ ద్విచక్ర వాహన యజమానులు తమ బైక్‌లను బైక్ ట్యాక్సీలుగా నడిపేందుకు అనుమతించాలని కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. ఇప్పటికే కొన్ని రాష్ట్రాల్లో ప్రైవేట్ బైక్‌లతో ప్రయాణికులను తరలించేందుకు అనుమతి ఉందని, మరికొన్ని రాష్ట్రాలు మాత్రం బైక్ ట్యాక్సీలకు అనుమతించడం లేదని తెలిపారు. బైక్ ట్యాక్సీ సేవలను ప్రోత్సహిస్తే దేశవ్యాప్తంగా సుమారు 8 కోట్ల మందికి జీవనోపాధి అవకాశాలు లభించే అవకాశం ఉందన్నారు. ముఖ్యంగా ఉపాధి అవకాశాలు పరిమితంగా ఉన్న గ్రామీణ ప్రాంతాల్లో ఇది అదనపు ఆదాయ వనరుగా మారుతుందని చెప్పారు. అయితే బైక్ ట్యాక్సీలకు అనుమతులు, బీమా, ఇతర నిబంధనలు ఆయా రాష్ట్రాల విధానాలపై ఆధారపడి ఉంటాయని స్పష్టం చేశారు.



**రాష్ట్రాల నిర్ణయంపైనే అనుమతులు**

రవాణా అంశం రాష్ట్రాల పరిధిలో ఉన్నందున బైక్ ట్యాక్సీలను అనుమతించాలా వద్దా అనేది రాష్ట్ర ప్రభుత్వాలే నిర్ణయిస్తాయని గడ్కరీ తెలిపారు. కేంద్ర మంత్రి సూచన చేసినంత మాత్రాన దేశవ్యాప్తంగా వెంటనే బైక్ ట్యాక్సీలకు అనుమతి లభిస్తుందని భావించకూడదన్నారు.

**ఉల్లంఘనలకు నెగెటివ్ పాయింట్లు**

రోడ్డు భద్రతపై గడ్కరీ కీలక ప్రతిపాదన చేశారు. పదేపదే ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే డ్రైవర్లపై చర్యలను కఠినతరం చేసేందుకు మోటార్ వెహికల్స్ చట్టంలో మార్పులు తీసుకురావాలని ప్రభుత్వం యోచిస్తోందన్నారు. ప్రతి ఉల్లంఘనకు నెగెటివ్ పాయింట్లు కేటాయించే విధానాన్ని తీసుకురావచ్చని తెలిపారు. నిర్ణీత స్థాయికి పాయింట్లు చేరితే డ్రైవింగ్ లైసెన్స్‌ను సస్పెండ్ చేయడం లేదా రద్దు చేసే అవకాశం ఉంటుందని చెప్పారు.

**డ్రైవర్ల ఆరోగ్యంపై 'సురక్ష'**

డ్రైవర్లు, నిర్మాణ కార్మికులు, హైవేలు, మైనింగ్ ప్రాజెక్టులతో సంబంధం ఉన్న ఇతర సిబ్బందికి ఉచిత వైద్య పరీక్షలు, కౌన్సెలింగ్ అందించేందుకు 'సురక్ష' అనే పైలట్ కార్యక్రమాన్ని గడ్కరీ ప్రారంభించారు. తొలుత మహారాష్ట్రలోని నాగ్‌పూర్-కాంప్టీ ఎన్‌హెచ్ 44లో 150 కిలోమీటర్ల పరిధితో పాటు చంద్రపూర్ మైనింగ్ ప్రాంతాల్లో ఈ కార్యక్రమాన్ని అమలు చేయనున్నారు. తొలి దశలో 10 వేల మందికి సేవలు అందించడమే లక్ష్యంగా పెట్టుకున్నారు.

**కంటి పరీక్షలకు ప్రాధాన్యం**

డ్రైవర్ల ఆరోగ్యం, ముఖ్యంగా కంటి చూపు పరీక్షలు రోడ్డు భద్రతకు ఎంతో కీలకమని గడ్కరీ అన్నారు. సురక్షిత డ్రైవింగ్‌పై డ్రైవర్లకు సరైన అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. భారీ వాహనాలు, నిర్మాణ పరికరాలు నడిపే వారికి తగిన శిక్షణ అందించే వ్యవస్థ ప్రస్తుతం సరిపడా లేదని పేర్కొన్నారు. డ్రైవింగ్ శిక్షణతో పాటు ఆరోగ్య పరీక్షలకు కూడా ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.

# కాంగ్రెస్ దగా పాలనపై బీఆర్ఎస్ రైతు సమర శంఖం

- ఎకరానికి రూ.15 వేల రైతుభరోసా వెంటనే చెల్లించాలి
- పాలకుర్తిలో వ్యవసాయ మార్కెట్ ఏర్పాటు చేయాలి
- మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్

**శెనార్తి మీడియా, గోదావరిఖని (పాలకుర్తి):**



కాంగ్రెస్ ప్రభుత్వం రైతాంగానికి ఇచ్చిన హామీలను విస్మరించి దగా పాలన సాగిస్తోందని బీఆర్ఎస్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు, రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ తీవ్రంగా విమర్శించారు. పాలకుర్తి మండలం బసంత్‌నగర్‌లోని జీఎం గార్డెన్‌లో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు మురళీధర్‌రావు అధ్యక్షతన నిర్వహించిన 'కాంగ్రెస్ దగా పాలనపై రైతు సదస్సు'లో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా చందర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రైతాంగం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోందని ఆరోపించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ప్రతి ఎకరానికి ఏడాదికి రూ.15 వేల రైతుభరోసాను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా రైతులకు ఇచ్చిన హామీ ప్రకారం క్వింటాల్ ధాన్యానికి రూ.500 బోనస్ చెల్లించాలని కోరారు. పాలకుర్తి ప్రాంత రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని వెంటనే వ్యవసాయ మార్కెట్‌ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతుల సమస్యలు, సంక్షేమ పథకాల అమలులో ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు రాబోయే ఎనిమిది రోజుల పాటు నియోజకవర్గవ్యాప్తంగా వివిధ నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు వేర్వేరు సమన్వయకర్తలను నియమించినట్లు వెల్లడించారు. రాజకీయాల్లో డబ్బు కంటే ప్రజాబలమే ముఖ్యమని చందర్ పేర్కొన్నారు. పెద్దంపేట గ్రామంలో ప్రత్యర్థులు రూ.20 లక్షలు ఖర్చు చేసినప్పటికీ, బీఆర్ఎస్ ప్రజల మద్దతుతో ఘన విజయం సాధించిందని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన



హామీలను అమలు చేసే వరకు రైతుల పక్షాన బీఆర్ఎస్ నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేశారు. ఈ సదస్సులో బీఆర్ఎస్ నాయకులు మూల విజయరెడ్డి, హరీష్‌రెడ్డి, రాగం శ్రీనివాస్, సతీష్, బండారి ప్రవీణ్, రామారావుపల్లె వెంకటేష్, పద్మ, సమ్మయ్య యాదవ్, అలవాల రాజయ్య, శ్రీవాణి కిరణ్, మధికరెడ్డి స్రవంతితో పాటు నియోజకవర్గానికి చెందిన సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, కార్పొరేటర్లు, ఎంపీటీసీలు, మాజీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## వెయ్యి రోజుల పాలనపై కాంగ్రెస్ ర్యాలీ

**శెనార్తి మీడియా, శంకరపట్నం:**

కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన వెయ్యి రోజుల పాలన చారిత్రక మైలురాయిగా నిలిచిందని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. పట్టణ అధ్యక్షుడు కత్తి రమేష్ ఆధ్వర్యంలో అంబేద్కర్ చౌరస్తా నుంచి ఎడ్లబండి చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. రైతు రుణమాఫీ, రైతు భరోసా, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రైతు బీమా, రూ.500కే గ్యాస్ సిలిండర్, ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్ కార్డులు, సన్నబియ్యం పంపిణీ వంటి కార్యక్రమాలను ప్రభుత్వం చేపట్టిందన్నారు. వెయ్యి రోజుల్లో 70 వేలకు పైగా ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసినట్లు తెలిపారు. కాంగ్రెస్ పాలనలో ప్రతి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం జరుగుతోందని, దీనిపై గ్రామాలకు వెళ్లి చర్చించేందుకు సిద్ధమని సవాల్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి అక్కరవేణి పోచయ్య ముదిరాజ్, ఏఎంసీ వైస్ చైర్మన్ చిలివేరు శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచులు గుడెల్లీ శ్రీకాంత్, పులి రమేష్, రాజిరెడ్డి, జెట్టి రమేష్, నాయకులు ముక్కిస రత్నాకర్‌రెడ్డి, చెప్యాల శ్రీనివాస్‌గౌడ్, ఉప సర్పంచులు పోతిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, మచ్చ కుమార్, జెల్ల ప్రభాకర్‌యాదవ్, రావుల నర్సయ్య, పీఏసీఎస్ డైరెక్టర్లు బైర సంతోష్, గంగాధార రామచంద్రం, మాషం శంకర్, తుమ్మ సుధాకర్, అడుకని నర్సింగం, వార్డు సభ్యులు బోనగం రమేష్‌గౌడ్, ఎలిగే సతీష్, పర్స సంతోష్, జంగిలి సంపత్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కర్రావుల సందీప్, ఐలేని మహేందర్‌రెడ్డి, గుబిరే చంద్రం, బోనగిరి ఎల్లయ్య, గ్రామ శాఖల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రైతు సమస్యలపై బీఆర్ఎస్ ధర్నా



**శెనార్తి మీడియా, బెజ్జంకి:**

వ్యవసాయ, నీటిపారుదల రంగాలపై కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, యూరియా కొరత, రైతు బీమా అమలులో విఫలమైందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పాకాల మహిపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం మండల కేంద్రంలో రైతు ధర్నా నిర్వహించారు. డీ9 కాలువకు వెంటనే నీటిని విడుదల చేసి పంటలను కాపాడాలని, రైతులకు సరిపడా యూరియా అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. రైతు బీమాను సమర్థవంతంగా అమలు చేయడంతో పాటు సాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ బొల్లం శ్రీధర్ పెద్దన్న, సీనియర్ నాయకులు లింగాల లక్ష్మణ్, చింతకింది శ్రీనివాస్‌గుప్తా, ముక్కిస తిరుపతిరెడ్డి, కచ్చు రాజయ్య, చేలుకల తిరుపతిరెడ్డి, ఎల శేఖర్‌బాబు, ఉప సర్పంచులు దుమాల మహేష్, యాలాల పరుశురాం, చింతలపల్లి సంజీవరెడ్డి, తిప్పారపు మహేష్, చెరుకూరి నరసయ్య, కొరివి తిరుపతి ముదిరాజ్, మంకాల శేఖర్, ఘనపురం తిరుపతి, కల్లూరి అజయ్‌యాదవ్, మహేష్, పరశురాములు, ముక్కిస అంజిరెడ్డి, బాల్‌రెడ్డి, తిరుపతి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



## రోడ్లు నిర్మించారు.. డ్రైనేజీ మరిచారు!

- 51వ డివిజన్ లక్ష్మీనగర్‌లో వర్షపు నీటితో ప్రజలకు ఇబ్బందులు
- సమస్యను వెంటనే పరిష్కరించాలి
- కార్పొరేటర్ ఆకారపు రేఖా మహేష్ డిమాండ్

**శెనార్తి మీడియా గోదావరిఖని:**

కోట్ల రూపాయల ప్రజాధనంతో రోడ్లు, ఫుట్‌పాత్‌లు, రోడ్ లైట్లు ఏర్పాటు చేసినప్పటికీ వర్షపు నీరు వెళ్లేందుకు సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని రామగుండం నగర పాలక సంస్థ 51వ డివిజన్ కార్పొరేటర్ ఆకారపు రేఖా మహేష్ అన్నారు.

డివిజన్ పరిధి లక్ష్మీనగర్‌లోని ప్రధాన కూడలి రోడ్డుపై వర్షపు నీరు భారీగా నిలిచిపోవడంతో వాహనదారులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. నిలిచిన నీరు సమీపంలోని షాపుల్లోకి చేరడంతో వ్యాపారులు కూడా ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఇటీవల మంచిర్యాలలో రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించిన సందర్భంగా అక్కడ రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజీలు ఏర్పాటు చేసి, వాటిపై ఇనుప జాలీలు అమర్చి వర్షపు నీరు వెంటనే డ్రైనేజీలోకి వెళ్లేలా పనులు చేపడుతున్నారని తెలిపారు. అదే తరహాలో రామగుండం నగరంలోనూ రోడ్డు నిర్మాణంతో పాటు వర్షపు నీటి పారుదలకు శాశ్వత పరిష్కారం చూపాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజాధనంతో చేపట్టే అభివృద్ధి పనుల్లో నాణ్యత, పారదర్శకతతో పాటు భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకోవాలని సూచించారు. రోడ్లు నిర్మించడం మాత్రమే అభివృద్ధి కాదని, ప్రజలకు పూర్తిస్థాయిలో ఉపయోగపడే మౌలిక వసతులు కల్పించడమే నిజమైన అభివృద్ధి అని అన్నారు. లక్ష్మీనగర్‌లో నిలిచిన వర్షపు నీటిని తక్షణమే తొలగించడంతో పాటు రోడ్డుకు ఇరువైపులా సరైన డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేసి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ అధికారులను, మేయర్‌ను కార్పొరేటర్ ఆకారపు రేఖా మహేష్ ఈ సందర్భంగా కోరారు





## గురు రవిదాస్ చిత్రపట అవమానంపై నిరసన

**శెనార్తి మీడియా, బెజ్జంకి:**

గురు రవిదాస్ మహారాజ్ చిత్రపటంపై నల్ల రంగు చల్లిన ఘటనను ఖండిస్తూ బీజేపీ దళిత మోర్చా మండల అధ్యక్షుడు బెజ్జంకి రాజమల్లు ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. బీజేపీ మండల అధ్యక్షుడు కొలిపాక రాజు మాట్లాడుతూ ఘటనపై ప్రభుత్వం వెంటనే స్పందించి బాధ్యులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి కరివేద మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ రవిదాస్ మహారాజ్ సమానత్వం, సామాజిక న్యాయం, మానవతా విలువలను చాటిచెప్పిన మహనీయుడని, ఆయన చిత్రపటాన్ని అవమానించడం ప్రజల మనోభావాలను దెబ్బతీయడమేనన్నారు. బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకునే వరకు ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో గుగ్గిళ్ల సర్పంచ్ గుగ్గిళ్ల మల్లయ్య, మండల నాయకులు బోయినిపల్లి అనిల్‌రావు, సంగ రవి, గైని రాజు, అడుకని వీరేశం, బుర్ర వినీత్, జెల్ల అనిల్, కందిరాజు జగన్‌రాజు, దోమ్మాటి రాములు, ఎలుక శ్రీశైలం, బండిపల్లి శ్రీనివాస్, దొడ్ల ప్రశాంత్, సాన వేణు తదితరులు పాల్గొన్నారు.



## హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

- 6 గ్యారెంటీలు, 420 హామీలపై బీజేపీ నిరసన
- కార్పొరేటర్లకు వినతిపత్రాలు

**శెనార్తి మీడియా, రామగుండం:**

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన 6 గ్యారెంటీలు, 420 హామీలు, వివిధ డిక్లరేషన్లను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపిస్తూ బీజేపీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర నాయకురాలు సోమారపు లావణ్య నేతృత్వంలో చేపట్టిన కార్యక్రమంలో ఆయా డివిజన్ల ప్రజా ప్రతినిధులకు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా 39వ డివిజన్ కార్పొరేటర్ తిప్పారపు మానస-శరత్, 52వ డివిజన్ కార్పొరేటర్ చిదురాల నాగరాజులకు బీజేపీ నాయకులు వినతిపత్రాలు సమర్పించారు. కార్యక్రమంలో సోమారపు లావణ్య మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఇన్ని నెలలు గడుస్తున్నా ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయలేదని విమర్శించారు. హామీల పేరుతో ప్రజల ఓట్లు పొందిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు ప్రజలను మోసం చేస్తోందని ఆరోపించారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి 6 గ్యారెంటీలతో పాటు ఎన్నికల సమయంలో ఇచ్చిన 420 హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై బీజేపీ నిరంతరం ప్రజల పక్షాన ప్రశ్నిస్తుందని ఆమె స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు మాతంగి రేణుక, బూడిద రమేష్, పంగ రవి, అరిగెల శ్రావణ్, మెరుగు శ్రీనివాస్, మహేష్, శివ, శ్రీనివాస్, భాగ్యశ్రీ, మేడి రాజుతో పాటు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





## మొలంగూర్ పాఠశాలలో కృష్ణాష్టమి సంబరాలు

**శెనార్తి మీడియా, శంకరపట్నం:**



మండలంలోని మొలంగూర్ ఉన్నత పాఠశాలలో ముందస్తు కృష్ణాష్టమి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కంకణాల నీరజ ఉట్టి కొట్టే వేడుకలను ప్రారంభించి, కృష్ణాష్టమి పండుగ ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. ఉట్టి కొట్టే కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమానికి ముందు విద్యార్థినులు కోలాటంతో చేసిన నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. వేడుకల్లో పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

## మానవత్వం చాటుకున్న బలరామ్ యాదవ్

**శెనార్తి మీడియా, శేరిలింగంపల్లి:**

శ్రీరామ్‌నగర్ కాలనీకి చెందిన కాశీం వల్లి బ్రెయిన్ స్ట్రోక్‌తో మృతి చెందడంతో కాలనీలో విషాదం నెలకొంది. అనుకోని ఘటనతో కుటుంబ సభ్యులు తీవ్ర దుఃఖంలో మునిగిపోయారు. మృతుడి కుటుంబ ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉండటంతో విషయం తెలుసుకున్న కాంగ్రెస్ సీనియర్ నాయకుడు బలరామ్ యాదవ్ స్పందించారు.

**మృతుడి కుటుంబానికి రూ.15 వేల సాయం**

ఈ సందర్భంగా బలరామ్ యాదవ్ మృతుడి కుటుంబాన్ని పరామర్శించి, మానవతా దృక్పథంతో తన వంతుగా రూ.15 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని, భవిష్యత్తులోనూ అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని భరోసా ఇచ్చారు



# వెయ్యి రోజుల పాలన.. సంక్షేమానికి పెద్దపీట

- **కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు అర్ధరహితం**
- **మాజీ జెడ్పీటీసీ బత్తిని శ్రీనివాస్‌గౌడ్**



**శెనార్తి మీడియా, శంకరపట్నం:**

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తూ పాలన సాగిస్తోందని మాజీ జెడ్పీటీసీ బత్తిని శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను గమనించకుండా కాంగ్రెస్‌పై విమర్శలు చేయడం అజ్ఞానానికి నిదర్శనమని వ్యాఖ్యానించారు. శంకరపట్నం మండలం కేశవపట్నంలోని అంబేద్కర్ కూడలి వద్ద మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రభుత్వ వెయ్యి రోజుల పాలన సందర్భంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వం అనేక అవకాశాలను కల్పిస్తోందన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడంతో పాటు మహిళా క్యాంటీన్లు, పెట్రోల్ బంకుల ఏర్పాటుకు చర్యలు చేపట్టిందన్నారు. ప్రజలపై ఆర్థిక భారం తగ్గించే ఉద్దేశంతో 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, సబ్సిడీ గ్యాస్ సిలిండర్ వంటి పథకాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని సన్నధాన్యాలకు క్వింటాల్‌కు రూ.500 బోనస్, రైతు భరోసా కింద ఎకరాకు రూ.12 వేల సాయం, రూ.2 లక్షల వరకు పంట రుణాల మాఫీ వంటి నిర్ణయాలు తీసుకున్నట్లు వివరించారు. రైతులు, మహిళలు, పేద, మధ్యతరగతి కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా అంబేద్కర్ కూడలి నుంచి కేశవపట్నం బస్టాండ్ వరకు పార్టీ శ్రేణులు భారీ ర్యాలీ నిర్వహించారు. కాంగ్రెస్ జెండాలతో ర్యాలీగా వెళ్లి అనంతరం ప్రజలకు, కార్యకర్తలకు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బండారి తిరుపతి, సహకార సంఘాల చైర్మన్లు,మార్కెట్ వైస్ చైర్మన్ నాంపల్లి తిరుపతి, జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి గట్టు తిరుపతి, మాజీ చైర్మన్లు, కోరెం రాజిరెడ్డి, ఉప్పుగళ్ల మల్లారెడ్డి, సర్పంచులు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## కాంగ్రెస్ పాలనకు

# చరమ గీతం పాడాలి

- **తెలంగాణ పునర్నిర్మాణం బీఆర్ఎస్‌తోనే సాధ్యం:**
- **మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నాయకుడు రసమయి బాలకిషన్**

**శెనార్తి మీడియా, శంకరపట్నం:**

కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నాయకుడు రసమయి బాలకిషన్ విమర్శించారు. రాష్ట్రంలో గోసాల కాలం ముగిసి తెలంగాణ పునర్నిర్మాణం జరగాల్సిన అవసరం ఉందన్నారు. శంకరపట్నం మండలం కేశవపట్నంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనకు వ్యతిరేకంగా నిరసన ర్యాలీ, వంటా వార్పు కార్యక్రమాన్ని నిర్వహించారు. 420 హామీలతో కూడిన ఫ్లెక్సీని ప్రదర్శిస్తూ కార్యకర్తలు కరీంనగర్-వరంగల్ ప్రధాన రహదారిపై ర్యాలీ చేపట్టారు. అనంతరం జరిగిన సభలో రసమయి బాలకిషన్ మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను ప్రజలు నమ్మి అధికారం అప్పగించారని, అయితే వాటి అమలులో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. మోసపోతే గోసపడతామని కేసీఆర్ ముందే హెచ్చరించారు. ప్రస్తుతం అదే పరిస్థితి కనిపిస్తోంది అన్నారు.



**- రైతుల పరిస్థితిపై ఆవేదన**

రైతే దేశానికి అన్నం పెట్టే వాడని, పంటలు పండించి ప్రజలకు ఆహారం అందించేది రైతన్నేనని రసమయి బాలకిషన్ అన్నారు. కాంగ్రెస్ పాలనలో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో సాగునీటి రంగంలో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలతో బీడు భూములు సస్యశ్యామలంగా మారాయని పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా సాగునీటి విస్తరణకు కేసీఆర్ ప్రభుత్వం కృషి చేసిందని తెలిపారు. కేసీఆర్ పాలనను గుర్తు చేస్తూ వరి, మొక్కజొన్న పంటలు, చెరువులు కన్నీరు పెడుతున్నాయంటూ పాట రూపంలో తనదైన శైలిలో ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు.

**కల్వల ప్రాజెక్టుపై సవాల్**

తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో కల్వల ప్రాజెక్టు మరమ్మతుల కోసం రూ.18 లక్షలు మంజూరు చేసి డీపీఆర్ సిద్ధం చేశామని రసమయి బాలకిషన్ తెలిపారు. ఎన్నికల కోడ్ కారణంగా పనులు నిలిచిపోయాయని చెప్పారు. ప్రస్తుత ఎమ్మెల్యే కల్వల ప్రాజెక్టు మరమ్మతులు పూర్తి చేస్తే తానే స్వయంగా సన్మానం చేస్తానని సవాల్ చేశారు.

కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలుపై ఆ పార్టీ నాయకులను ప్రజలు ప్రశ్నించాలని ఆయన పిలుపునిచ్చారు. హామీలన్నీ అమలు చేసే వరకు బీఆర్ఎస్ ప్రజల తరఫున ప్రశ్నిస్తూనే ఉంటుందని స్పష్టం చేశారు. రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని ధీమా వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, మండల అధ్యక్షుడు గంట మహిపాల్, మాజీ జెడ్పీటీసీలు సంజీవరెడ్డి, లింగంపల్లి శ్రీనివాసరెడ్డి, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు కొయ్యడ పరశురాములు, సర్పంచులు, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యం




**శెనార్తి మీడియా, గన్నేరువరం:**

మండల కేంద్రంలో శుక్రవారం మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ శ్రేణులు ర్యాలీ నిర్వహించి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రజా సంక్షేమం, అభివృద్ధి దిశగా ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్, సన్న వడ్లకు రూ.500 బోనస్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతు భరోసా వంటి పథకాలతో మహిళలు, రైతులు, మధ్యతరగతి కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బొడ్డు సునీల్, జిల్లా కాంగ్రెస్ నాయకుడు అల్వాల కోటి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు మాతంగి అనిల్, పట్టణ అధ్యక్షుడు చింతల శ్రీధర్‌రెడ్డి, పాకాల పరశురాం, బుర్ర తిరుపతితో పాటు మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు



## వెయ్యి రోజుల పాలన..

# కాంగ్రెస్ జోష్

**శెనార్తి మీడియా, కూసుమంచి:**

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా కూసుమంచిలో కాంగ్రెస్ శ్రేణులు భారీగా సంబరాలు నిర్వహించారు. నాయకన్‌గూడెం నుంచి కూసుమంచి వరకు సుమారు 1000 బైకులతో భారీ ర్యాలీ చేపట్టారు. రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఓపెన్ టాప్ జీపులో ర్యాలీలో పాల్గొని పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నింపారు. అనంతరం కూసుమంచి ప్రధాన సెంటర్‌లో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు.

**3,475 రోజుల పాలనలో చేసిందేమీ లేదు**

ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ నేతలు కాంగ్రెస్ ప్రజాపాలనపై విష ప్రచారం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ 3,475 రోజుల పాలనలో ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పేదలకు ఇందిరమ్మ ఇళ్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, నిరుద్యోగులకు ఉద్యోగ నోటిఫికేషన్లు తదితర కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. తమ పాలనకు గత పాలనకు నక్కకు నాగలోకానికి ఉన్నంత తేడా ఉందన్నారు. పెద్ద దొర ఫామ్‌హౌస్‌కే పరిమితమయ్యారని, పిల్ల కాకులు కారు కూతలు మానుకోవాలని సూచించారు.

**పాలేరు అభివృద్ధికి కోట్లాది నిధులు**

పాలేరు నియోజకవర్గానికి కోట్లాది రూపాయల నిధులు కేటాయించి అభివృద్ధి పనులు చేపట్టామని, భవిష్యత్తులో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని మంత్రి తెలిపారు. గత బీఆర్ఎస్ పాలనలో పాలేరు రిజర్వాయర్‌ను నిర్లక్ష్యం చేసి రైతులను విస్మరించారని ఆరోపించారు. పాలేరు ప్రాంతానికి కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని స్పష్టం చేశారు.

**పాలేరులో మళ్లీ కాంగ్రెస్‌దే విజయం**

పాలేరు అంటేనే కాంగ్రెస్ అని, పాలేరు తనకు సొంతిల్లని మంత్రి పొంగులేటి అన్నారు. ఎవరెన్ని ప్రయత్నాలు చేసినా వచ్చే ఎన్నికల్లో పాలేరులో గెలిచేది, నిలిచేది ముమ్మాటికీ కాంగ్రెస్ పార్టీయేనని తేల్చి చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బజ్జూరి వెంకటరెడ్డి, జిల్లా కార్యదర్శి హఫీజ్ ఉద్దీన్, మాజీ ఎంపీపీ శ్రీనివాస్, జూకూరి గోపాలరావు, కూసుమంచి సర్పంచ్ కొండా కృష్ణవేణి, పాలేరు సర్పంచ్ బానోత్ నాగేశ్వరరావుతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.





## గణేష్ నవరాత్రి ఉత్సవాలు

# శాంతియుతంగా జరుపుకోవాలి

- **గణేష్ నవరాత్రి ఉత్సవాలపై సమన్వయ సమావేశం**
- **శాంతియుతంగా ఉత్సవాలు నిర్వహించాలి.**
- **అగ్నిప్రమాదాల నివారణ, నియంత్రణపై అగ్నిమాపక సిబ్బంది ప్రదర్శన**

**శెనార్తి మీడియా, బోడుప్పల్**

గణేష్ నవరాత్రి ఉత్సవాల నిర్వహణకు సంబంధించి ముందస్తు ఏర్పాట్లు, భద్రతా చర్యలపై వివిధ శాఖల అధికారులు, గణేష్ ఉత్సవ నిర్వాహకులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. శుక్రవారం సాయంత్రం 4 గంటలకు బోడుప్పల్‌లోని ఆర్ కన్వెన్షన్ హాల్‌లో మేడిపల్లి పోలీసుల ఆధ్వర్యంలో ఈ సమావేశం జరిగింది. సమావేశానికి ఉప్పల్ అదనపు పోలీసు ఉప కమిషనర్ వెంకటరమణ, మేడిపల్లి సహాయ పోలీసు కమిషనర్ బిట్టు మోహన్ కుమార్‌తో పాటు ట్రాఫిక్, రెవెన్యూ, పురపాలక, అగ్నిమాపక, విద్యుత్ శాఖలకు చెందిన అధికారులు హాజరయ్యారు. బోడుప్పల్, మేడిపల్లి పరిసర ప్రాంతాలకు చెందిన సుమారు 200 మంది గణేష్ ఉత్సవ నిర్వాహకులు సమావేశంలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ గణేష్ నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని నిర్వాహకులకు సూచించారు. ఉత్సవ మండపాల ఏర్పాటు, విద్యుత్ వినియోగం, భద్రతా ఏర్పాట్లు, ట్రాఫిక్ నియంత్రణ తదితర అంశాల్లో సంబంధిత శాఖలు సూచించే నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు. ఉత్సవాల సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన ఏర్పాట్లు చేసుకోవాలని, మండపాల వద్ద భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులు సూచించారు. ఏదైనా సమస్య, ఇబ్బంది లేదా ఫిర్యాదు ఎదురైనప్పుడు నిర్వాహకులు సంబంధిత అధికారులను సంప్రదించి పరిష్కరించుకోవాలని తెలిపారు. అగ్నిప్రమాదాల నివారణ, ప్రమాదం సంభవించినప్పుడు తక్షణమే మంటలను అదుపులోకి తీసుకునే విధానాలపై అగ్నిమాపక శాఖ సిబ్బంది నిర్వాహకులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అగ్నిమాపక పరికరాలను ఎలా ఉపయోగించాలి, మంటలు చెలరేగిన సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రమాదాన్ని ఎలా నివారించాలి అనే అంశాలపై ప్రత్యక్ష ప్రదర్శన నిర్వహించారు. గణేష్ ఉత్సవాల సందర్భంగా అన్ని శాఖలతో సమన్వయం చేసుకుంటూ భద్రతా ప్రమాణాలను పాటించాలని, ప్రజలు మరియు భక్తుల రక్షణకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులు సూచించారు. సమావేశంలో పోలీసు అధికారులు, వివిధ శాఖల సిబ్బంది, గణేష్ ఉత్సవ నిర్వాహకులు పాల్గొన్నారు.



## రెప్కో హోమ్ ఫైనాన్స్

# నూతన ప్రాంతీయ కార్యాలయం ప్రారంభం



**శెనార్తి మీడియా, హైదరాబాద్ :**

సామాన్య, పేద ప్రజలకు ఆర్థిక సహకారం అందించేందుకు రెప్కో హోమ్ ఫైనాన్స్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని మేనేజింగ్ డైరెక్టర్ టి కరుణాకరన్ తెలిపారు. ఈ మేరకు బుధవారం అమీర్‌పేటలోని ఇంపీరియల్ టవర్స్‌లో రెప్కో హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్ నూతన హైదరాబాద్ ప్రాంతీయ కార్యాలయాన్ని ప్రారంభించారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్, ముఖ్య కార్యనిర్వహణ అధికారి టి. కరుణాకరన్ ముఖ్య అతిథిగా హాజరై నూతన కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... హైదరాబాద్‌తో పాటు తెలంగాణలో గృహ రుణ సేవలను మరింత విస్తరించేందుకు నూతన ప్రాంతీయ కార్యాలయం కీలకంగా పనిచేస్తుందని తెలిపారు. ప్రజలకు గృహ నిర్మాణం, గృహ కొనుగోలుకు అవసరమైన ఆర్థిక సహకారాన్ని అందించడంలో సంస్థ మరింత చురుగ్గా పనిచేస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రాంతీయ మేనేజర్ జి. అశోక్ కుమార్, ప్రాంతీయ అభివృద్ధి మేనేజర్ చింతా శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# 22ఏ జాబితా నుంచి భూములు తొలగించాలి

**శెనార్తి మీడియా, పీర్జాదిగూడ:**

ప్రజలు కష్టపడి సంపాదించిన డబ్బుతో కొనుగోలు చేసిన పట్టా భూములు, ప్రైవేట్ స్థలాలను 22ఏ నిషేధిత జాబితాలో చేర్చి ఆస్తి హక్కులను హరించడం ఎంతవరకు సమంజసమని మాజీ మేయర్ జక్క వెంకట్‌రెడ్డి ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా బీఆర్ఎస్ చేపట్టిన నిరసన కార్యక్రమాల్లో భాగంగా మేడిపల్లి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు.

**భూ యజమానులకు తప్పని ఇబ్బందులు**

ఈ సందర్భంగా జక్క వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ ఏళ్ల తరబడి కష్టపడి సంపాదించిన సొమ్ముతో భూములు కొనుగోలు చేసిన రైతులు, మధ్యతరగతి కుటుంబాలు 22ఏ జాబితా కారణంగా రిజిస్ట్రేషన్లు, భూ లావాదేవీలు, బ్యాంకు రుణాల విషయంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. భూ యజమానుల పత్రాలు, అభ్యంతరాలను పూర్తిస్థాయిలో పరిశీలించకుండా అర్హతలేని భూములను నిషేధిత జాబితాలో చేర్చడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు.

**అర్హతలేని భూములను తొలగించాలి**

ప్రజల ఆస్తులకు రక్షణ కల్పించాల్సిన ప్రభుత్వం వారి భూములపైనే ఆంక్షలు విధించడం దుర్మార్గమైన చర్య అని ఆయన మండిపడ్డారు. 22ఏ జాబితాలో భూములు చేరడంతో యజమానులు ఆస్తులను విక్రయించలేక, అవసరమైన సమయంలో రుణాలు పొందలేక కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారని తెలిపారు. భూ యజమానుల అభ్యంతరాలను స్వీకరించి, సంబంధిత పత్రాలను సమగ్రంగా పరిశీలించిన అనంతరం అర్హతలేని భూములను 22ఏ జాబితా నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఏడవల్లి రఘువర్ధన్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్లు దొంతిరి హరిశంకర్‌రెడ్డి, కొల్తూరి మహేష్, లేతాకుల మాధవి, రఘుపతిరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, కౌడే పోచయ్య, మహిళా అధ్యక్షురాలు నిర్మల, యువజన అధ్యక్షుడు ప్రభు, సీనియర్ నాయకులు ఆకుల మధుకర్, యూబీఏ అధ్యక్షుడు ఆకుల సత్యనారాయణతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# ఘోర ఓటమి

## భారత్‌పై పాక్ అక్కసు!

**ఇంగ్లాండ్ చేతిలో వరుసగా రెండు టెస్టుల్లో పరాజయం**

**పాక్ క్రికెట్ బోర్డుపై మాజీ ఆటగాళ్ల విమర్శలు**

**జట్టు ప్రదర్శనను సమర్థించిన మోసిన్ నఖ్వీ**

**చిన్న జట్ల చేతిలో పెద్ద జట్ల ఓటముల ప్రస్తావన**

**భారత్ ఓటమిని పరోక్షంగా గుర్తుచేశారంటున్న విశ్లేషకులు**

**ఢిల్లీ, సెప్టెంబర్ 2 :** ఇంగ్లాండ్ చేతిలో వరుసగా రెండు టెస్టుల్లో ఘోర పరాజయాలు ఎదురైనా పాకిస్థాన్ క్రికెట్ బోర్డు చీఫ్ మోసిన్ నఖ్వీ తమ జట్టు ప్రదర్శనను సమర్థించుకున్నారు. పాక్ క్రికెట్ పతనానికి బోర్డు వ్యవహారశైలే కారణమంటూ ఆ దేశ మాజీ క్రికెటర్లు విమర్శలు గుప్పిస్తున్న వేళ.. ఇటీవల చిన్న జట్ల చేతిలో పెద్ద జట్లు కూడా ఓడిపోయాయని నఖ్వీ వ్యాఖ్యానించడం చర్చనీయాంశమైంది. "ఇటీవల చిన్న జట్ల చేతిలో పెద్ద జట్లు ఓడిపోయాయి. అంతమాత్రాన అక్కడ క్రికెట్ ముగిసిపోయిందా?" అని నఖ్వీ ప్రశ్నించారు. జట్టుకు అవసరమైన ఆటగాళ్లను కచ్చితంగా ఎంపిక చేస్తామని చెప్పారు. ఆటగాళ్లు ఆశించిన స్థాయిలో రాణించకపోతే బోర్డు మాత్రం ఏం చేయగలదని ప్రశ్నించారు. తమకు ప్రతి మ్యాచ్, ప్రతి సిరీస్ ముఖ్యమేనని పేర్కొన్నారు. ఇంగ్లాండ్‌తో రెండు టెస్టుల్లో ఓటమిని తేలిగ్గా తీసుకోవడం లేదని నఖ్వీ స్పష్టం చేశారు. వన్డేలు, టీ20ల్లో సాధించిన పురోగతిని టెస్టుల్లోనూ కొనసాగిస్తామని విశ్వాసం వ్యక్తం చేశారు. విమర్శలకు తాను ఎప్పుడూ భయపడలేదని, ఇకముందూ భయపడబోనని చెప్పారు.

### ర్యాంకింగ్స్ చూపిస్తున్న నఖ్వీ


తాను పీసీబీ చీఫ్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత పాకిస్థాన్ క్రికెట్ నాశనమైందంటున్న వారు గత ర్యాంకింగ్స్‌ను కూడా చూడాలని నఖ్వీ సూచించారు. వన్డేల్లో ఎనిమిదో స్థానం నుంచి ఐదో స్థానానికి, టీ20ల్లో తొమ్మిదో స్థానం నుంచి ఆరో స్థానానికి జట్టు చేరిందని పేర్కొన్నారు. ఈ పురోగతిని కూడా పరిగణనలోకి తీసుకోవాలని అన్నారు. అయితే చిన్న జట్ల చేతిలో పెద్ద జట్లు ఓడిన విషయాన్ని నఖ్వీ ప్రస్తావించడం వెనుక భారత్, దక్షిణాఫ్రికా ఇటీవల ఎదుర్కొన్న పరాజయాలను ఉద్దేశించి ఉండొచ్చని క్రికెట్ వర్గాల్లో చర్చ సాగుతోంది. పాకిస్థాన్ జట్టు వైఫల్యాలపై దృష్టి పెట్టకుండా ఇతర జట్ల ఓటములను ఉదాహరణగా చూపడం ఎంతవరకు సమంజసమన్న విమర్శలూ వినిపిస్తున్నాయి. వరుస టెస్టు పరాజయాలతో పాక్ క్రికెట్‌పై సొంత దేశంలోనే విమర్శలు వెల్లువెత్తుతున్న సమయంలో నఖ్వీ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు మరో వివాదానికి తెరతీశాయి.

# నీరజ్ స్థానంలో 24 ఏళ్ల 'బడిసే వీరుడు'!

**ఆసియా క్రీడలకు యశ్వీర్ సింగ్ ఎంపిక**

**గాయంతో మెగా టోర్నీకి నీరజ్ దూరం**



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 3:** ప్రతిష్ఠాత్మక ఆసియా క్రీడల్లో భారత జావెలిన్ త్రో విభాగంలో కీలక మార్పు చోటుచేసుకుంది. గాయం కారణంగా ఒలింపిక్ విజేత నీరజ్ చోప్రా ఈ మెగా టోర్నీకి దూరం కావడంతో అతడి స్థానంలో 24 ఏళ్ల యశ్వీర్ సింగ్‌కు అవకాశం దక్కింది. ఇటీవల కామన్వెల్త్ క్రీడల్లో కాంస్య పతకంతో మెరిసిన యశ్వీర్‌ను భారత అథ్లెటిక్స్ జట్టులోకి తీసుకున్నట్లు అథ్లెటిక్స్ సమాఖ్య గురువారం వెల్లడించింది. గత కొంతకాలంగా అంతర్జాతీయ జావెలిన్ త్రోలో భారత్‌కు పతకాల పంట పండిస్తున్న నీరజ్ చోప్రా ఈసారి ఆసియా క్రీడల్లో కనిపించడు. కాలి మడమకు గాయం కారణంగా అతడు పోటీలకు అందుబాటులో ఉండటం లేదు. దీంతో నీరజ్ స్థానాన్ని భర్తీ చేసే అవకాశం యువ జావెలిన్ త్రోయర్ యశ్వీర్ సింగ్‌ను వరించింది. యశ్వీర్ ఇటీవల కామన్వెల్త్ క్రీడల్లో 85.41 మీటర్ల దూరం ఈటెను విసిరి కాంస్య పతకం సాధించాడు. ఆ ప్రదర్శనతో అందరి దృష్టిని ఆకర్షించిన ఈ 24 ఏళ్ల యువ అథ్లెట్ ఇప్పుడు ఆసియా వేదికపై భారత్‌కు మరో పతకం అందించాలనే పట్టుదలతో ఉన్నాడు. జావెలిన్ త్రోలో భారత్ తరఫున యశ్వీర్‌తో పాటు రోహిత్ యాదవ్ కూడా బరిలోకి దిగనున్నాడు. ఇద్దరూ కలిసి పతక వేట సాగించనున్నారు. అయితే వారికి శ్రీలంకకు చెందిన రుమేశ్ తరంగ పతిరగేతో పాటు పాకిస్థాన్ స్టార్ జావెలిన్ త్రోయర్ అర్షద్ నదీమ్ నుంచి గట్టి పోటీ ఎదురయ్యే అవకాశం ఉంది. నీరజ్ చోప్రా లేని లోటును యువ అథ్లెట్లు ఎంతవరకు భర్తీ చేస్తారన్నది ఆసక్తికరంగా మారింది.

# కెప్టెన్ సంచలనం.. 5 పరుగులకే 7 వికెట్లు!

- హ్యాట్రిక్‌తో చమరి అటపట్టు విధ్వంసం
- ఇండోనేషియాపై శ్రీలంక 75 పరుగుల ఘన విజయం
- మహిళల టీ20ల్లో శ్రీలంక తరఫున తొలి హ్యాట్రిక్
- 49 పరుగులకే కుప్పకూలిన ఇండోనేషియా
- అర్ధ సెంచరీతో ఆదుకున్న నీలాక్షిక సిల్వా



**క్రీడా విభాగం:** మహిళల ఆసియా కప్‌లో శ్రీలంక కెప్టెన్ చమరి అటపట్టు బంతితో సంచలనం సృష్టించింది. కేవలం 5 పరుగులిచ్చి ఏకంగా 7 వికెట్లు పడగొట్టడంతో పాటు హ్యాట్రిక్ సాధించి ఇండోనేషియా బ్యాటింగ్‌ను కకావికలం చేసింది. ఫలితంగా బుధవారం జరిగిన మ్యాచ్‌లో శ్రీలంక 75 పరుగుల భారీ తేడాతో ఇండోనేషియాను చిత్తు చేసింది. టాస్ గెలిచిన ఇండోనేషియా తొలుత బౌలింగ్ ఎంచుకుంది. ఆరంభం నుంచే ఆ జట్టు బౌలర్లు శ్రీలంక బ్యాటర్లను ఇబ్బంది పెట్టారు. రెండో ఓవర్లోనే ఇమేషా దులానీని పెవిలియన్‌కు పంపించారు. ఆ తర్వాత స్పిన్నర్లు వరుసగా వికెట్లు పడగొట్టడంతో శ్రీలంక ఒక దశలో 36 పరుగులకే నాలుగు వికెట్లు కోల్పోయింది. 68 పరుగుల వద్ద ఆరో వికెట్ కూడా పడడంతో స్వల్ప స్కోరుకే పరిమితమయ్యేలా కనిపించింది. ఈ దశలో నీలాక్షిక సిల్వా జట్టును ఆదుకుంది. ఆరంభంలో ఎంతో ఓపికగా ఆడిన ఆమె చివరి ఓవర్లలో వేగం పెంచింది. సిక్సర్‌తో అర్ధ సెంచరీ పూర్తి చేసుకుంది. టీ20 అంతర్జాతీయ క్రికెట్‌లో ఆమెకు ఇది మూడో అర్ధ సెంచరీ. సిల్వా 50 పరుగులతో రాణించడంతో శ్రీలంక నిర్ణీత 20 ఓవర్లలో ఏడు వికెట్లకు 124 పరుగులు చేసింది.

### అటపట్టు స్పిన్‌కు విలవిల

125 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఇండోనేషియాకు అటపట్టు చుక్కలు చూపించింది. ఓపెనర్ పాంగెస్టుటిని ఔట్ చేసిన ఆమె ఆ తర్వాత వరుసగా వికెట్లు పడగొడుతూ ప్రత్యర్థి బ్యాటింగ్ వెన్నువిరిచింది. పది ఓవర్లు ముగిసేసరికే ఇండోనేషియా 29 పరుగులకు ఐదు వికెట్లు కోల్పోయింది. శ్రీలంక బౌలర్ల కట్టుదిట్టమైన బౌలింగ్‌తో ఇండోనేషియా బ్యాటర్లు పరుగుల కోసం తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. రెండో ఓవర్ నుంచి 15వ ఓవర్ వరకు వారి బ్యాట్ నుంచి ఒక్క బౌండరీ మాత్రమే రావడం శ్రీలంక ఆధిపత్యానికి అద్దం పట్టింది.

### వరుసగా మూడు.. చరిత్రలో తొలి హ్యాట్రిక్

చివర్లో అటపట్టు మరింత చెలరేగింది. అరియాని, మాయ్‌ప్రియాని, పరమితిని వరుస బంతుల్లో ఔట్ చేసి హ్యాట్రిక్ నమోదు చేసింది. మహిళల టీ20 అంతర్జాతీయ క్రికెట్‌లో శ్రీలంక తరఫున ఇదే తొలి హ్యాట్రిక్‌గా నిలిచింది. అంతర్జాతీయ క్రికెట్‌లో అటపట్టుకు ఇదే తొలి ఐదు వికెట్ల ప్రదర్శన కూడా కావడం విశేషం. చివరకు ఇండోనేషియా 18.3 ఓవర్లలో 49 పరుగులకే ఆలౌటైంది. అటపట్టు కేవలం 5 పరుగులిచ్చి ఏడు వికెట్లు పడగొట్టి కెరీర్ అత్యుత్తమ గణాంకాలను నమోదు చేసింది. మహిళల టీ20ల్లో శ్రీలంక తరఫున అత్యుత్తమ బౌలింగ్ ప్రదర్శనగా ఇది నిలిచింది. సంక్షిప్త స్కోర్లు: శ్రీలంక 20 ఓవర్లలో 124/7 (నీలాక్షిక సిల్వా 50, సంజన కవిందీ 15; దేవి 3/23, మాయ్‌ప్రియాని 2/19). ఇండోనేషియా 18.3 ఓవర్లలో 49 ఆలౌట్ (సువాండేవి 12, పాంగెస్టుటి 10; చమరి అటపట్టు 7/5, కుమారి 1/3). శ్రీలంక 75 పరుగుల తేడాతో విజయం.

# బీసీసీఐ కీలక భేటీ.. లక్ష్మణ్‌కు అదిరే ఛాన్స్!

**టీమిండియా ప్రదర్శనపై ఉన్నతస్థాయి సమీక్ష**

**గంభీర్, గిల్, అయ్యర్‌తో బోర్డు పెద్దల చర్చలు**

**న్యూజిలాండ్ పర్యటనపై ప్రత్యేక దృష్టి**

**రోహిత్ వన్డే భవిష్యత్తుపైనా చర్చ**

**ఆసియా క్రీడలకు భారత కోచ్‌గా లక్ష్మణ్**



**ముంబై, సెప్టెంబర్ 3:** భారత క్రికెట్ జట్టు భవిష్యత్ కార్యాచరణపై బీసీసీఐ కీలక సమీక్ష నిర్వహించింది. ముంబైలోని బీసీసీఐ ప్రధాన కార్యాలయంలో జరిగిన ఈ ఉన్నతస్థాయి సమావేశంలో టీమిండియా ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్, కెప్టెన్ శుభ్‌మన్ గిల్, శ్రేయస్ అయ్యర్‌తో పాటు సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ అధిపతి వీవీఎస్ లక్ష్మణ్ పాల్గొన్నారు. వ్యక్తిగత కారణాలతో చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ సమావేశానికి హాజరుకాలేదు. బీసీసీఐ అధ్యక్షుడు మిథున్ మన్హాస్, కార్యదర్శి దేవజిత్ సైకియా, కోశాధికారి ప్రభతేజ్ సింగ్ భాటియా, తాత్కాలిక సీఈఓ హేమాంగ్ అమీన్ సమావేశంలో పాల్గొన్నారు. ఈ ఏడాది చివర్లో జరగనున్న న్యూజిలాండ్ పర్యటనతో పాటు వచ్చే ఏడాది వన్డే ప్రపంచకప్ సన్నాహాల నేపథ్యంలో ఈ భేటీకి ప్రాధాన్యం ఏర్పడింది. ఇటీవల ఐర్లాండ్, ఇంగ్లాండ్‌తో జరిగిన పరిమిత ఓవర్ల సిరీస్‌లలో భారత జట్టు ప్రదర్శన, ఆటగాళ్ల ఫిట్‌నెస్, భవిష్యత్ ప్రణాళికలపై ప్రధానంగా చర్చించినట్లు సమాచారం. ఇంగ్లాండ్, ఐర్లాండ్ పర్యటనల్లో ఆడిన ఆరు టీ20ల్లో భారత్ ఒక్క విజయమూ సాధించకపోవడంపైనా సమీక్షించినట్లు తెలుస్తోంది. ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ పాయింట్ల పట్టికలో భారత్ ప్రస్తుతం ఐదో స్థానంలో ఉన్న నేపథ్యంలో న్యూజిలాండ్‌తో జరగనున్న అన్ని ఫార్మాట్ల సిరీస్‌పైనా ప్రత్యేకంగా చర్చించారు. ఈ పర్యటనలో ఐదు టీ20లు, ఐదు వన్డేలు, రెండు టెస్టులు జరగనున్నాయి. ఆటగాళ్ల పనిభారం నియంత్రణతో పాటు కీలక ఆటగాళ్లకు ప్రత్యామ్నాయాలను సిద్ధం చేసుకోవడంపై కోచింగ్ బృందం స్పష్టమైన ప్రణాళికతో ముందుకెళ్లాలని బోర్డు భావిస్తున్నట్లు సమాచారం.

### రోహిత్ భవిష్యత్తుపైనా చర్చ?

సీనియర్ బ్యాటర్ రోహిత్ శర్మ వన్డే భవిష్యత్తు కూడా సమావేశంలో చర్చకు వచ్చినట్లు తెలుస్తోంది. రోహిత్ రిటైర్మెంట్‌పై వస్తున్న ప్రచారాన్ని బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా ఇప్పటికే ఖండించినప్పటికీ.. 2027 వన్డే ప్రపంచకప్ ప్రణాళికల్లో ఆయన పాత్రపైనా చర్చ కొనసాగుతున్నట్లు సమాచారం.

### లక్ష్మణ్‌కు కీలక బాధ్యత

మరోవైపు వీవీఎస్ లక్ష్మణ్‌కు కీలక బాధ్యత దక్కనుంది. 2026 ఆసియా క్రీడల్లో పాల్గొనే భారత క్రికెట్ జట్టుకు ఆయన ప్రధాన కోచ్‌గా వ్యవహరించనున్నట్లు సమాచారం. లక్ష్మణ్‌తో పాటు సునీల్ జోషి, హృషికేశ్ కనిట్కర్, సుభాదీప్ ఘోష్ కోచింగ్ బృందంలో ఉండనున్నారు. సమావేశం ముగిసిన అనంతరం గౌతమ్ గంభీర్, శుభ్‌మన్ గిల్, శ్రేయస్ అయ్యర్, వీవీఎస్ లక్ష్మణ్ మీడియాతో మాట్లాడకుండానే అక్కడి నుంచి వెళ్లిపోయారు.

# 'ఇంపాక్ట్' వద్దు.. ఆడితే ఫుల్‌గానే!

**ధోనీ ఐపీఎల్ భవిష్యత్తుపై మళ్లీ ఉత్కంఠ**

**పూర్తి స్థాయి కీపర్‌గానే ఆడాలని నిర్ణయం**

**బద్రీనాథ్ వ్యాఖ్యలతో కొత్త చర్చ**

**ఫిట్‌నెస్‌పైనే భవిష్యత్తు ఆధారం**

**చెన్నై, సెప్టెంబర్ 3:** ఐపీఎల్‌లో మహేంద్రసింగ్ ధోనీ భవిష్యత్తుపై మరోసారి ఉత్కంఠ నెలకొంది. చెన్నై సూపర్ కింగ్స్ తరఫున కొనసాగితే పూర్తి స్థాయి వికెట్ కీపర్-బ్యాటర్‌గానే ఆడాలని ధోనీ భావిస్తున్నారని, కేవలం 'ఇంపాక్ట్ ప్లేయర్' పాత్రకు ఆయన సిద్ధంగా లేరని సీఎస్కే మాజీ బ్యాటర్ సుబ్రమణ్యం బద్రీనాథ్ వెల్లడించారు. దీంతో 2027 ఐపీఎల్‌లో ధోనీ కొనసాగుతారా? లేక తన సుదీర్ఘ ప్రయాణానికి ముగింపు పలుకుతారా? అన్న చర్చ మొదలైంది. వయసు, గతంలో ఎదురైన మోకాలి సమస్యలను దృష్టిలో పెట్టుకుంటే మ్యాచ్ మొత్తం వికెట్ కీపింగ్ చేయడం ధోనీకి సవాలుగా మారవచ్చని బద్రీనాథ్ అభిప్రాయపడ్డారు. పనిభారం తగ్గించుకునేందుకు ఇంపాక్ట్ ప్లేయర్ నిబంధన ఉపయోగపడుతుందని, చివరి ఓవర్లలో బ్యాటింగ్‌కు వచ్చి ఫినిషర్‌గా సేవలందించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. దీనివల్ల సీఎస్కేకు వ్యూహాత్మక ప్రయోజనం కూడా ఉంటుందన్నారు. అయితే ధోనీ మాత్రం తనను పూర్తిస్థాయి వికెట్ కీపర్‌గానే భావిస్తున్నారని బద్రీనాథ్ తెలిపారు. సగం మ్యాచ్‌కే పరిమితమయ్యే ఇంపాక్ట్ ప్లేయర్ పాత్రపై ఆయన ఆసక్తి చూపడం లేదన్నారు. ఆడితే వికెట్ కీపర్--బ్యాటర్‌గా పూర్తి బాధ్యతలు నిర్వర్తించాలన్నదే ధోనీ ఆలోచనగా పేర్కొన్నారు.

### ఫిట్‌నెస్‌పైనే అసలు నిర్ణయం

గత కొన్ని సీజన్లుగా ధోనీ మోకాలి సమస్యలతో ఇబ్బంది పడుతున్నారు. 2024 సీజన్‌కు ముందు సీఎస్కే కెప్టెన్సీ బాధ్యతల నుంచి తప్పుకున్న ఆయన.. ఆ తర్వాత బ్యాటింగ్‌లోనూ ఎక్కువగా చివరి ఓవర్లకే పరిమితమయ్యారు. దీంతో వయసు, ఫిట్‌నెస్, పనిభారం దృష్ట్యా రాబోయే సీజన్‌లో ఆయన పాత్ర ఎలా ఉండబోతోందన్నది ఆసక్తికరంగా మారింది. ఐదు ఐపీఎల్ టైటిళ్లు అందించి సీఎస్కేను అత్యంత విజయవంతమైన జట్లలో ఒకటిగా నిలిపిన ధోనీకి అభిమానుల్లో ఉన్న క్రేజ్ ప్రత్యేకం. అయితే 'ఇంపాక్ట్ ప్లేయర్'గా కాకుండా పూర్తి స్థాయి వికెట్ కీపర్‌గానే ఆడాలన్న ఆయన వైఖరి నేపథ్యంలో 2027 ఐపీఎల్‌లో ధోనీ కనిపిస్తారా?.. లేక ఐపీఎల్ ప్రయాణానికి ముగింపు పలుకుతారా? అన్నదానికి ఆయన ఫిట్‌నెస్, తుది నిర్ణయమే సమాధానం చెప్పనుంది.





# యంగ్ డైరెక్టర్ తో కమల్ నయా మూవీ

సినిమా సినిమాకూ వైవిధ్యం చూపుతూ, నవతరం దర్శకులతో అద్భుతమైన ప్రాజెక్ట్‌లను సెట్ చేసుకుంటున్న 'ఉలగనాయగన్' కమల్ హాసన్ తాజాగా మరో సెన్సేషనల్ ప్రాజెక్ట్ కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. 'పన్నైయారుమ్ పద్మినియుమ్', 'సేతుపతి', రీసెంట్‌గా 'సిద్ధా' వంటి విమర్శకుల ప్రశంసలు పొందిన చిత్రాలను తెరకెక్కించిన యంగ్ అండ్ టాలెంటెడ్ డైరెక్టర్ ఎస్.యు. అరుణ్ కుమార్‌తో కమల్ హాసన్ చేతులు కలిపారు. ఈ క్రేజీ కాంబినేషన్‌లో రాబోతున్న ఈ సరికొత్త చిత్రాన్ని కమల్ తన సొంత నిర్మాణ సంస్థ రాజ్ కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్ (RKFI) బ్యానర్‌పై ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. ఈ సంచలన ప్రాజెక్టును ఆర్.కె.ఎఫ్.ఐ తో పాటు ప్రముఖ నిర్మాత ఆర్. మహేంద్రన్, టర్మెరిక్ మీడియా సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. 'విక్రమ్' లాంటి ఇండస్ట్రీ హిట్ తర్వాత రాజ్ కమల్ సంస్థ బ్యాక్ టు బ్యాక్ క్రేజీ ప్రాజెక్టులను నిర్మిస్తున్న విషయం తెలిసిందే. ఇప్పుడు కమల్ హాసన్ స్వయంగా నటిస్తూ, నిర్మిస్తున్న ఈ సరికొత్త చిత్రంపై ఇండస్ట్రీలో అప్పుడే భారీ అంచనాలు నెలకొన్నాయి. అరుణ్ కుమార్ కథలు సాధారణంగా చాలా గ్రౌండెడ్‌గా, ఎమోషనల్‌గా, బలమైన పాత్రల చుట్టూ అల్లుకుని ఉంటాయి. అలాంటి క్యారెక్టర్ డ్రైవెన్ డైరెక్టర్‌కు, కమల్ హాసన్ లాంటి విశ్వనటుడు తోడైతే వెండితెరపై ఆ మ్యాజిక్ ఎలా ఉంటుందోనని అభిమానులు ఎగ్జైట్ అవుతున్నారు. కమల్ ఇమేజ్‌కు సరిపోయే ఒక పవర్ ఫుల్ పోలీస్ బ్యాక్‌డ్రాప్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌ను అరుణ్ కుమార్ సిద్ధం చేసినట్లు సమాచారం. ఈ చిత్రానికి సంబంధించిన నటీనటులు, ఇతర సాంకేతిక నిపుణుల వివరాలను మేకర్స్ త్వరలోనే అధికారికంగా ప్రకటించనున్నారు. దశాబ్దాలుగా ఇండియన్ సినిమాను ఏలుతున్న దిగ్గజ నటుడు, ఓ సెన్సిబుల్ యంగ్ డైరెక్టర్‌కు అవకాశం ఇవ్వడం ఇప్పుడు కోలీవుడ్‌తో పాటు టాలీవుడ్‌లోనూ హాట్ టాపిక్‌గా మారింది.



# 'ఎపిక్' ట్రైలర్ విడుదలకు ముహూర్తం ఫిక్స్..

బేబీ' సినిమాతో బాక్సాఫీస్ వద్ద రికార్డు కలెక్షన్లు సాధించి, యూత్‌ను ఉర్రూతలూగించిన సక్సెస్‌ఫుల్ జోడీ ఆనంద్ దేవరకొండ, వైష్ణవి చైతన్య. ఈ హిట్ కాంబినేషన్‌లో వస్తున్న లేటెస్ట్ యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ చిత్రం 'ఎపిక్'. డెబ్యూ డైరెక్టర్ ఆదిత్య హాసన్ తెరకెక్కిస్తున్న ఈ ప్రాజెక్ట్‌పై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థలు సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్లపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య సంయుక్తంగా నిర్మిస్తుండగా, శ్రీకర స్టూడియోస్ సమర్పిస్తోంది. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం సెప్టెంబర్ 11న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి వచ్చేందుకు సిద్ధంగా ఉంది. రిలీజ్ డేట్ దగ్గరపడుతుండటంతో చిత్రబృందం ప్రమోషన్ల వేగాన్ని పెంచేసింది. వరుస అప్‌డేట్లతో సోషల్ మీడియాలో సందడి చేస్తున్న మేకర్స్, తాజాగా మూవీ లవర్స్ ఎంతగానో ఎదురుచూస్తున్న ట్రైలర్ డేట్‌ను అధికారికంగా ప్రకటించారు. 'ఎపిక్' చిత్ర ట్రైలర్‌ను సెప్టెంబర్ 4న విడుదల చేయనున్నట్లు తెలుపుతూ.. ఒక ఆకట్టుకునే పోస్టర్‌ను షేర్ చేశారు. మొదటి సినిమాతోనే లవ్ అండ్ ఎమోషన్స్‌ను అద్భుతంగా పండించిన ఆనంద్‌వైష్ణవి జోడీ, ఈసారి 'ఎపిక్'తో ఎలాంటి మ్యాజిక్ చేయబోతున్నారో చూడాలని సినీ ప్రియులు ఎంతగానో ఎదురుచూస్తున్నారు.


# ఓటీటీలపై శివాజీ షాకింగ్ కామెంట్స్

ఆనంద్ దేవరకొండ, వైష్ణవి చైతన్య జంటగా నటిస్తున్న 'ఎపిక్: ఫస్ట్ సెమిస్టర్' చిత్రం సెప్టెంబర్ 11న విడుదల కానుంది. ఆదిత్య హాసన్ దర్శకత్వం వహించిన ఈ సినిమా ప్రమోషన్స్‌లో నటుడు శివాజీ చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. ఓటీటీలు సోమరిపోతుల కోసం మాత్రమేనని, తాను నటించిన '90s-ఎ మిడిల్ క్లాస్ బయోపిక్' థియేటర్లలో విడుదలై ఉంటే సులభంగా రూ.100 కోట్ల గ్రాస్ వసూలు చేసేదని శివాజీ వ్యాఖ్యానించారు. థియేటర్‌లో సినిమా చూసే అనుభూతి ప్రత్యేకమని చెప్పే ఉద్దేశంతోనే ఆయన ఈ వ్యాఖ్యలు చేసినట్లు కొందరు సమర్థిస్తున్నారు. అయితే బిజీ జీవితం, పెరిగిన టికెట్ ధరల నేపథ్యంలో ఇంట్లోనే కుటుంబంతో సినిమాలు చూసే అవకాశం ఓటీటీలు కల్పిస్తున్నాయని, ప్రేక్షకులను సోమరిపోతులుగా పేర్కొనడం సరికాదని మరికొందరు విమర్శిస్తున్నారు. కాగా, శివాజీ నటించిన '90s-ఎ మిడిల్ క్లాస్ బయోపిక్' ఓటీటీలో ఘన విజయం సాధించి ఆయనకు రెండో ఇన్నింగ్స్‌లో మంచి గుర్తింపు తెచ్చింది.



# యూట్యూబ్‌ను షేక్ చేస్తున్న'యేషనాగుల'.. 5 రోజుల్లోనే 50 మిలియన్ల వ్యూస్!

టాలీవుడ్ సంగీత ప్రపంచంలో సరికొత్త చరిత్ర నమోదైంది. 'ది ప్యారడైజ్' ప్రాజెక్ట్ నుంచి వచ్చిన పవర్ ఫుల్ మాస్ ట్రాక్ 'యేషనాగుల' (Yeshanagula) ఇంటర్నెట్‌లో సునామీ సృష్టిస్తోంది. విడుదలైన కేవలం ఐదు రోజుల్లోపే ఏకంగా 50 మిలియన్లకు (50M+) పైగా వ్యూస్ కొల్లగొట్టి, తెలుగులోనే అత్యంత వేగంగా ఈ ఫీట్ సాధించిన పాటగా సరికొత్త ఆల్‌టైమ్ రికార్డును నెలకొల్పింది. ప్రస్తుతం సోషల్ మీడియాలో ఎక్కడ చూసినా ఈ పాటే మారుమోగిపోతోంది. విడుదలైన క్షణం నుంచే చార్ట్‌బస్టర్‌గా మారిన ఈ గీతం, ఇప్పుడు సరిహద్దులు దాటి ప్రపంచవ్యాప్తంగా సంగీత ప్రియులను ఉర్రూతలూగిస్తోంది. కేవలం తెలుగు రాష్ట్రాలకే పరిమితం కాకుండా, దేశ విదేశాల్లోని శ్రోతలను సైతం తన మాస్ బీట్స్‌తో కట్టిపడేస్తూ ఒక 'గ్లోబల్ మాస్ మ్యూజిక్ మూవ్‌మెంట్'గా మారింది. ఇన్‌స్టాగ్రామ్ రీల్స్, యూట్యూబ్ షార్ట్స్‌లో ఎక్కడ క్లిక్ చేసినా ఈ పాటకు సంబంధించిన డ్యాన్స్ వీడియోలే దర్శనమిస్తున్నాయి. తెలుగులో ఎన్నో సూపర్ హిట్ సాంగ్స్ వచ్చినప్పటికీ, ఐదు రోజుల వ్యవధిలోనే 50 మిలియన్ల మార్కును దాటడం అనేది సాధారణ విషయం కాదు. ఈ పాటలోని మాస్ ఎనర్జీ, ఆకట్టుకునే రిథమ్ ప్రేక్షకులను విపరీతంగా ఆకర్షిస్తున్నాయి. యూట్యూబ్‌లో వ్యూస్ పరుగులు తీస్తున్న వేగం చూస్తుంటే, రాబోయే రోజుల్లో ఈ 'ఏశానగుల' సాంగ్ మరిన్ని గ్లోబల్ రికార్డులను బద్దలు కొట్టడం ఖాయంగా కనిపిస్తోంది.




# వాళ్లకూ కమిట్ మెంట్స్ వేధింపులు తప్పవు: కామాక్షి భాస్కర్ల

'మా ఊరి పొలిమేర' సినిమాతో గుర్తింపు తెచ్చుకున్న నటి కామాక్షి భాస్కర్ల తాజాగా టాలీవుడ్‌లోని కమిట్‌మెంట్ వ్యవహారాలపై సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆఫర్ల పేరుతో వేధించే సంస్కృతి అన్ని చిత్ర పరిశ్రమల్లోనూ ఉందని ఆమె పేర్కొన్నారు. నిజమైన నిర్మాతల కంటే.. చేతిలో డబ్బు ఉందనే ధీమాతో చిత్ర పరిశ్రమలోకి వచ్చే కొందరు వ్యక్తులే నటీనటులను మోసం చేస్తున్నారని కామాక్షి ఆరోపించారు. ఈ తరహా వేధింపులు హీరోయిన్లకే కాకుండా, దర్శకులు కావాలనుకునే యువకులకు కూడా ఎదురవుతున్నాయని తెలిపారు. తన కెరీర్ ప్రారంభంలో కమిట్‌మెంట్ అనే మాటకు అసలు అర్థం తెలియక.. పని పట్ల తనకున్న నిబద్ధత గురించి అడుగుతున్నారని భావించేదానినని కామాక్షి చెప్పింది. ఆ పదం వెనుక ఉన్న అసలు అర్థం తెలుసుకోవడానికి తనకు మూడేళ్లు పట్టిందని వెల్లడించింది. ప్రస్తుతం ఆమె చేసిన వ్యాఖ్యలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి.



# ఎన్టీఆర్ 'డ్రాగన్'లో ఆలియా భట్

ఎన్టీఆర్, ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న 'డ్రాగన్' సినిమాపై రోజుకో వార్త వైరల్ అవుతోంది. ఇందులో రుక్మిణీ వసంత్ కథానాయికగా నటిస్తుండగా.. బాలీవుడ్ నటులు షాహిద్ కపూర్, ఆలియా భట్ కీలక పాత్రల్లో కనిపించనున్నారనే ప్రచారం జరుగుతోంది.

ఫిలిమ్ వర్గాల సమాచారం ప్రకారం.. ఇప్పటికే వీరిద్దరి పాత్రలు ఖరారైనట్లు, త్వరలోనే చిత్రబృందం అధికారిక ప్రకటన చేయనున్నట్లు సామాజిక మాధ్యమాల్లో పోస్టులు వైరల్ అవుతున్నాయి. అయితే దీనిపై ఇప్పటివరకు అధికారిక ధ్రువీకరణ రాలేదు.

ఇప్పటికే ఎన్టీఆర్, ఆలియా భట్ 'ఆర్ఆర్ఆర్'లో కలిసి నటించిన విషయం తెలిసిందే. దీంతో 'డ్రాగన్'లో వీరిద్దరి మధ్య పూర్తిస్థాయి సన్నివేశాలు ఉంటే బాగుంటుందని అభిమానులు అభిప్రాయపడుతున్నారు. కాగా, ఈ సినిమా చిత్రీకరణ దాదాపు 50 శాతం పూర్తయినట్లు తెలుస్తోంది. నటీనటుల పాత్రలపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



# 'ఇమ్మోర్టల్' ప్రమోషన్స్‌పై కాయదు షాకింగ్ కామెంట్స్

జీవీ ప్రకాశ్ కుమార్, కాయదు లోహర్ జంటగా నటించిన 'ఇమ్మోర్టల్' సినిమా ప్రమోషన్స్‌కు హీరోయిన్ దూరంగా ఉండటంపై నెట్టింట ట్రోలింగ్ జరిగిన విషయం తెలిసిందే. తాజాగా ఈ వివాదంపై కాయదు స్పందించింది. 'ఐ యామ్ గేమ్' ప్రమోషన్స్‌కు తనకు ఒక్క రోజు మాత్రమే సమయం అందుబాటులో ఉందని, అదే సమయంలో 'ఇమ్మోర్టల్' చిత్రబృందానికి కూడా ఆ తేదీ ఖాళీగా లేదని తెలిపింది. దీంతో 'ఐ యామ్ గేమ్' ప్రచార కార్యక్రమాలకు హాజరైన తర్వాత మరో సినిమా చిత్రీకరణలో పాల్గొన్నట్లు వివరించింది. తాను 'ఇమ్మోర్టల్' ప్రమోషన్స్‌కు హాజరు కాలేకపోయిన విషయంపై ఎవరికీ వివరణ ఇవ్వాల్సిన అవసరం లేదని కాయదు స్పష్టం చేసింది. ఏ సినిమా ముఖ్యమనే విషయంలో ఒక్కొక్కరికీ ఒక్కో అభిప్రాయం ఉంటుందని, ఇలాంటి ట్రోలింగ్‌కు తాను అలవాటు పడిపోయానని పేర్కొంది. ప్రస్తుతం 'ది ప్యారడైజ్', 'ఐ యామ్ గేమ్', 'సూర్య 48', 'ఇమ్మోర్టల్' వంటి చిత్రాలతో ఆమె బిజీగా ఉంది.

Printed, Published and Owned by V SAMPATH, and Printed at Sharada Printers, H.No 1-6-6, Shastri Road, Karimnagar, Dist: Karimnagar -505001,Telangana State, and Published from 8-5-137, Gayathri Nagar, Karimnagar (Karimnagar District) 505001,Telangana State. Editor: V SAMPATH. RNI NO : TELTEL/2023/89146 Email: shenarthimedia@gmail.com. Phone No: 9391343644